తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





## రైల్వే అధికారుల నిర్లక్ష్యానికి విద్యార్థుల నిరసన



దొరవారిసత్రం, నవంబర్ 11, ప్రభాతవార్త దొరవారిసత్రం మండల పరిధిలోని పోలిరెడ్డిపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న ఐ పాలెం దగ్గర రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జిలను నిర్మించడం తెలిసిందే. కానీ వర్షాలు పడినప్పుడు మాత్రం లోపల ఉన్న నీరును తీయడం మరిచిపోతున్నారు. స్కూలుకి పోవాల్సిన చిన్న పిల్లలు అదే అండర్ బ్రిడ్జిలో అధిక శాతం నీరు చేరడం వల్ల ఎటు పోలేకపోతున్నామని విద్యార్థులు తెలపడం గమనార్హం. నిత్యం వివిధ కంపెనీలకు వెళ్లాల్సిన వారు, అదేవిధంగా రోజువారి మా బతుకు జీవనం కోసం వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రైల్వే అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మా గోడు వినడం లేదని, ఇకనైనా సంబంధిత రైల్వే అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు అండర్ బ్రిడ్జిలోని నీరును మోటార్ పంపుల ద్వారా నీరుని తీసేయాలని కోరుతున్నామన్నారు.

# ఏం జరుగుతుందో!

## సర్వత్రా ఉత్కంఠత!!
## కస్టడీ పిటిషన్ 14కి వాయిదా



తిరుపతి, నవంబర్ 11ప్రభాతవార్త: టిటిడి కల్తీనెయ్యి కేసులో తాజా పరిణామాలతో మాజీ ఈఓ ఏవి ధర్మారెడ్డి మంగళవారం సిట్‌విచారణకు హాజరవ్వడం, ఉదయం నుండి సాయంత్రం వరకు సిట్ బృందం పలు కోణాల్లో ఆయన్ను ప్రశ్నల వర్షం కురిపించడంతో అవసరమైనంత వరకు సమాధానాలు వచ్చినట్లు తెలు స్తోంది. 2019 నుండి 2024వరకు టి టిడిలో సర్వంతానై వ్యవహరించిన ధర్మా రెడ్డి ఇప్పుడు ఊహించనిరీతిలో కల్తీనెయ్యి కేసులో సిట్ ముందుకు రావాల్సిన పరిస్థితిని ముందుగానే పసిగట్టలేకపోయారు. పైగా టిటిడిలో అధికారుల పాత్ర నామమాత్రమేనని, టిటిడి బోర్డు సుప్రీమ్ అనేది సిట్‌కు చెప్పారనేది సమాచారం. మరీ కల్తీ నెయ్యి విషయం, లడ్డూల నాణ్యత లేకపోవడం వంటివాటిపై గతంలో భక్తుల ఫిర్యాదులు ఎందుకు పట్టించుకోలేదనే ప్రశ్నలకు నాణ్యతతోనే తయారుచేశామనే సమాధానమిచ్చారనేది తెలిసింది. గత టిటిడి బోర్డులో కొనుగోలు కమిటీలో బోర్డు సభ్యులు కూడా సభ్యులుగా ఉన్నారని, వారు చెప్పినట్లే టెండర్లు ఇవ్వడం జరిగిందనేది వివరణ ఇచ్చారు. అంతేగాక ఈ నెయ్యి వ్యవహారంలో పలు డెయిరీలకు టెండర్లు కూడా బోర్డు సూచనలే అమలుచేశామనేది ఆయన సిట్‌కు ఇచ్చిన కీలక సమాచారంగా తెలిసింది. తొలిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు విచారణ చేసిన సిట్ నేడు కూడా దర్మారెడ్డిని విచారణ చేసిన తరువాత బయటకు పంపుతుందా?లేక సంచలన నిర్ణయం తీసుకుంటుందా అనేది టిటిడి వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు ఇదే కల్తీనెయ్యి సరఫరా కేసులో మాజీఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి సిట్ అధికారులు నోటీసులు జారీచేసి 13వతేదీ రావాలని చెప్పారు.అయితే ఆ రోజుకు బదులు 15వతేదీ వస్తానని వైవి సమాధానం ఇచ్చారనేది తెలిసింది. పైగా ఆయన చుట్టూ తీవ్రంగా ఆరోపణలు వెల్లువెత్తిన సమయంలో నోటీసులపై సుప్రీంకోర్టుకెళ్ళి విచారణను మరింత జాప్యం చేసుకోవాలనే యోచనలో ఉన్నారనేది హాట్‌గా మారింది. మంగళవారం సిట్ విచారణకు హాజరైన మాజీ ఈఓ ఏవి ధర్మారెడ్డి కూడా టెండర్లు, అభివృద్ధి పనులు, నిధులు కేటాయింపు వంటిఅంశాల్లో టిటిడి బోర్డు కీలకమని సమాదానం ఇవ్వడం ఇప్పుడు వైవి పాత్ర ఎంతవరకు అనేది సిట్ తేల్చనుంది. మరీ ఇద్దరు ప్రధాన వ్యక్తులను సిట్ విచారణ చేసిన తరువాత ఎలా ముందుకు అడుగు వేయనుంది. మరీ నేడు ధర్మారెడ్డి విషయంలోనే ఏం జరగబోతుందనేది కూడా విస్మ యం కలిగిస్తోంది. కల్తీనెయ్యి సరఫరాలో భారీగా ముడుపులు ముట్టాయనే ఆధారాల వివరాలను సిట్ గుర్తించింది. 2022లో వైవినే కీలకమనేది దాదాపు సిట్ ఖరారుచేసింది. కటకటాల్లో ఉన్న అప్పన్న, అజయ్‌కుమార్‌ల కస్టడీ పిటిషన్‌పై నెల్లూరు ఏసిబి కోర్టు 14కి వాయిదా వేసింది.

# పెట్టుబడులు పెట్టే స్థాయికి ఎదగాలి

- నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఇ పార్కు
- ఎంఎస్ఎంఇ పార్కులను వర్చువల్ విధానంలో ప్రారంభించిన సిఎం చంద్రబాబు



వెంకటాపురం వద్ద సిఎం వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఎంఎస్ఎంఇ కార్యక్రమానికి హాజరైన ఎంపీ దగ్గుమళ్ళ, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల తదితరులు

చిత్తూరు, నవంబర్ 11 ప్రభాతవార్త: పెట్టుబడులకు ఆకర్షితులు కావడం కాదని, పెట్టుబడులు పెట్టే స్థాయికి ఎదగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా కనిగిరిలోని పెద ఈర్లపాడులో ఎంఎస్ఎంఇ పార్కును ప్రారంభించిన సిఎం నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాల్లోని 50 ఎంఎస్ఎంఇ పార్కులకు వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. చిత్తూరు రూరల్ మండలం 5 వెకంటాపురంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఇ పార్కును సిఎం నారా చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. 5 వెంకటాపురం వర్చువల్ ప్రారంభోత్సవానికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, శాప్ ఛైర్మన్ రవినాయుడు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిఎం నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ జనవరి నాటికి రాష్ట్రంలో మరో 70 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి ప్రతి కుటుంబంలోను ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్తను తయారు చేస్తామన్నారు. ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి సిఎం నారా చంద్రబాబునాయుడు చిత్తూరు రూరల్ మండలం 5 వెంకటాపురంలో పరిశ్రమలు, ఉపాధి కల్పన పేరుతో ఎంఎస్ఇ-సిడిపిలను ప్రారంభించడం అభినందనీయమన్నారు. చిత్తూరు రూరల్ మండలంను నియోజకవర్గంలో పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దడానికి సిఎం ముందడుగు వేశారన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మరో మూడు ప్రాంతాల్లో నేడు ఇండస్ట్రీ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. చిత్తూరు రూరల్ మండలం 5 వెంకటాపురంలో 68 ఎకరాల విస్తీర్ణంలో 14.30 కోట్ల రూపాయలతో జిల్లాలో అతి పెద్ద ఇండస్ట్రియల్ పార్కు అన్నారు. అలాగే పుంగనూరు చదల గ్రామంలో రూ.9.50 కోట్ల వ్యయంతో 21.80 ఎకరాల విస్తీర్ణంలో, నగరి మాంగాడులో రూ.17.30 కోట్లతో 20 ఎకరాల విస్తీర్ణంలో, కుప్పంలో పల్లార్లపల్లి వద్ద రూ.2.06 కోట్లతో ఎస్ఎఫ్‌సికి శంకుస్థాపనలు అయా నియోజకవర్గాల్లో వర్చువల్ విధానంలో జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ డైరెక్టర్ మురళీమోహన్, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జిల్లా తెలుగుదేశం నాయకుడు చంద్రప్రకాష్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### సిఎం చంద్రబాబుచే ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు
# వర్చువల్ శంకుస్థాపన
## -15.65కోట్లతో పలార్లపల్లి వద్ద నిర్మాణం !!



కుప్పం, నవంబర్ 11 ప్రభాతవార్త మున్సిపల్ పరిధి పలార్లపల్లి వద్ద నూతనంగా నిర్మించనున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సి) నిర్మాణంకు మంగళవారం సిఎం చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో జరిగిన సభలో సిఎం చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ సుమారు 15.65 కోట్లతో నిర్మించనున్నారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఎంఎస్ఇ సిడిపి పథకంలో ఈ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను నిర్మిస్తారు. ఈ కాంప్లెక్స్‌లో 26 వ్యక్తిగత, 14 కామన్ యూనిట్లను నిర్మించనున్నారు. ఎఫ్ఎఫ్‌సిని రెండు అంతస్తుల్లో నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ ముని రత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, ఎపి ఐఐసి డైరెక్టర్ ప్రేమ్ కుమార్, ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, ఏరియా ఆస్పత్రివైస్ ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మండల అధ్యక్షుడు రాజగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కార్పోరేషన్ డైరెక్టర్ తిరుమగళ్, స్థానిక నేతలు పాల్గొన్నారు. కాగా ఈ ప్రాంతంలోనే అలీప్ సంస్థకు 13ఎకరాల భూమి కేటాయించారు. అలీప్ సంస్థ

# కాణిపాకంలో కొనసాగుతున్న పవిత్రోత్సవాలు





పవిత్ర మాలలను ఆలయం నుండి హోమ గుండం వద్దకు తీసుకువస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు. హోమంలను నిర్వహిస్తున్న రుత్వికులు

కాణిపాకం, నవంబర్ 11 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ఈమేరకు ఆలయ అలంకార మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్ద ఉదయం 9 గంటలకు విశేషసంధి,రెండవకాలపూజ స్థండిల మండలేశ్వర పూజ, పూజ, వత్ర సమర్పణ, రెండవ కాల వత్ర సమర్పణ, విశేష ద్రవ్యాహుతి, పూర్ణాహుతి, ద్రవ్యాహుతి, ప్రసాద వినియోగం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే సాయంత్రం 5 గంటలకు విశేషసంధి, మూడవకాలపూజ, స్థండిల మండలేశ్వర పూజ, హోమం, వ్రత సమర్పణ, మూడవకాల వ్రతసమర్పణ, విశేష ద్రవ్యాహుతి, దీపారాధన, ప్రసాద వినియోగం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణిస్వామి,టెంపుల్ ఇన్స్ పెక్టర్‌లు బాలాజినాయుడు చిట్టిబాబు,రుత్వికులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం...
## ఇద్దరు మృతి... ఇద్దరికీ గాయాలు



రోడ్డు ప్రమాదంలో నుజ్జు అయిన కారు. ఇన్సెట్లో మృతుడు.

రేణిగుంట నవంబర్ 11 ప్రభాతవార్త రేణిగుంట- కడప జాతీయ రహదారిపై రేణిగుంట మండలం శ్రీనివాసపురం వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు తిరుపతి రుయా ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా కర్నూలుకు చెందిన చంద్రభానుసింగ్ (37), తల్లి సరస్వతి బాయ్ (63), భార్య దివ్య (24), కుమార్తె త్రిక్షణ సింగ్ (5) లతో కలిసి కారులో చెన్నైకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు తిరుపతి జిల్లా రేణిగుంట మండలం ఆంజనేయపురం దాటి శ్రీనివాసపురం సమీపిస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రబాబు సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సరస్వతి బాయ్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. దివ్య, త్రిక్షణసింగ్ రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర సంఘటన స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను 108 అంబులెన్స్ లో రుయా హాస్పిటల్ కి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### గ్రేటర్ తిరుపతిలో
# పంచాయతీల విలీన కసరత్తు
## -ప్రజాభిప్రాయ తీర్మాన నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం

తిరుపతి, నవంబర్ 11 ప్రభాతవార్త: గ్రేటర్ తిరుపతిలో పంచాయతీల విలీనంపై అధికార యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది. గ్రేటర్ తిరుపతిలో 63 గ్రామ పంచాయతీలను విలీనంపై కౌన్సిల్ సమావేశం తీర్మానం చేసిన విషయం తెల్సిందే. గ్రేటర్ పరిధి విస్తరణకు అనుగుణంగా చుట్టుపక్కల గ్రామ పంచాయతీలను తిరుపతి కార్పోరేషన్‌లో విలీనం చేయాలన్న ప్రతిపాదనలపై చర్చలు వేగం పుంజుకున్నాయి. ఈ క్రమంలో తిరుపతిరూరల్ మండలంలో వున్న 34 గ్రామ పంచాయతీలకు జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేసిన విషయం విదితమే. పంచాయతీల విలీనంపై ప్రజాభిప్రాయాన్ని పదిరోజుల్లో తెలియజేయాలని ఆదేశించారు. ఆయా గ్రామ పంచాయతీలలో బోర్డు సమావేశం ఏర్పాటు చేసి, వార్డు సభ్యుల అభిప్రాయాన్ని లిఖితపూర్వకంగా సేకరించి, ప్రజా అమోదాన్ని జిల్లా పంచాయతీ అధికారికి తెలియజేయాలని పంచాయతీ కార్యధర్శులకు సూచించిన సంగతి తెల్సిందే. గ్రేటర్‌లో తిరుపతిరూరల్ మండల పంచాయతీల విలీనంపై భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. గ్రేటర్ పరిధిలోకి విలీనం జరిగితే అభివృద్ధి వేగవంతం అవుతుందని కొంతమంది ప్రజాప్రతి నిధులు స్వాగతిస్తుండగా, మరి కొంతమంది వ్యతిరేక స్వరాలు వినిపిస్తున్నాయి. గ్రేటర్‌లో పంచాయతీలో విలీనం చేస్తే ఇంటిపన్నులు. ఇతర పనుల భారంతో పాటు భవన నిర్మాణ అనుమతులకు చెల్లింపులు రెట్టింపు అవుతాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలుగా ఉంటే తక్కువ టాక్స్ చెల్లిస్తామని, గ్రేటర్‌లో కలిస్తే టాక్స్ భారం తప్ప ప్రయోజనం ఉండదని ఆయా గ్రామస్తులు అంటున్నారు. తిరుపతిరూరల్ మండలంలోని 34 గ్రామ పంచాయతీలలో ఎన్ని పంచాయతీలు గ్రేటర్‌లో విలీననానికి సుముఖత చూపుతాయో వేచి చూడాలి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం తిరుపతిరూరల్ మండల పంచాయతీల విలీననాన్ని వ్యతిరేకిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

# శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుచానూరు, నవంబర్ 11, ప్రభాతవార్త: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రానున్న కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారంకోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతం తో అమ్మవారిని మేలుకొలిపారు. అనంతరం వివిధ సుగంధ ద్రవ్యాలతో కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం గోడలు పైకప్పు పూజా సామాగ్రి తదితర అన్ని వస్తువులను శుద్ధి చేశారు. తరువాత ఆలయం అంతట పవిత్ర జలాన్ని ప్రోక్షణం చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆలయ డెప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో ఎం. రాధాకృష్ణమూర్తి, సూపరింటెండెంట్ రమేశ్,వాహన ఇన్స్పెక్టర్లు చలపతి, ఆర్జిత ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

**- 10 పరదాలు అమ్మవారికి బహుకరణ:**

హైదరాబాద్‌కు చెందిన స్వర్ణకుమార్ రెడ్డి ప్రతినిధులు అమ్మవారి ఆలయంలో మంగళవారం 7 పరదాలను, అదేవిధంగా తిరుపతికి చెందిన మణి 3 పరదాలను డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, అర్చకులు బాబు స్వామికి దాత అందజేశారు. అమ్మవారి గర్భాలయంలో పరదాలను అలంకరించనున్నారు.

# ఉద్యోగ ఉపాధి కల్పన చంద్రబాబుకే సాధ్యం
## మంత్రి నిమ్మల



పెళ్లకూరు నవంబర్ 11 ప్రభాతవార్త : ఎలాంటి ప్రతికూల పరిస్థితులైన తనకు అనుకూలంగా మార్చుకోగల సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబు అని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా లెక్కచేయకుండా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంతో ప్రజల మనలను పొందాడన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తగ్గించడానికి ఎన్నికల హామీల్లో ఇచ్చిన ఐదు లక్షల ఉద్యోగలా కల్పన విషయంలో ఇప్పటికే అనేక పరిశ్రమలను తీసుకొచ్చాడు అన్నారు అందులో భాగంగానే ఈనాడు పెళ్లకూరు మండలంలో సుమారు 450 కోట్ల తో మూడు పరిశ్రమలకు శంకుస్థాపన చేయడం జరిగిందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అనంతరం ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ మా విజనరీ ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ సమస్యను తగ్గించడమే కాకుండా ప్రతి ఇంటి నుండి ఒక మహిళను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడం కోసం నిరంతరం అహర్నిశలుకృషి చేస్తున్నాడు అన్నారు. చంద్రబాబు నాయుడు మహిళా పక్షిపాతని మహిళల అభివృద్ధి కోసం వారి ఉన్నతి కోసం అనేక రకాల పథకాలను ప్రవేశపెట్టడం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలకు సంబంధించిన అధికారులతో పాటు తెదేపా మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు తెదేపా నెల్లూరు రూరల్ యువ నాయకులు వేలూరు కళ్యాణ్ రెడ్డి చైతన్య కృష్ణారెడ్డి మల్లు ప్రసాద్ నాగేందర్ రెడ్డి మరియు తెలుగుదేశం జనసేన నాయకులు పాల్గొన్నారు.

# పొలం పనుల్లో అన్నదాతలు బిజీ బిజీ
## సమృద్ధిగా వర్షాలు, పెరిగిన భూగర్భ జలాలు

వరి నాట్లు వేస్తున్న దృశ్యం



శ్రీకాళహస్తి /శ్రీకాళహస్తి రూరల్,నవంబర్ 11 ప్రభాతవార్త శ్రీకాళహస్తి సత్యవేడు నియోజకవర్గాల్లో వ్యవసాయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో ముందస్తు ఖరీఫ్‌లో వాణిజ్యపంటలను ముందస్తు రబీలో వరి పంటను విస్తారంగా పండిస్తారు. ఓ వైపు చెరువుల మీద,మరో వైపు తెలుగుగంగ మీద ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్నారు. అక్టోబర్‌లో కురిసిన మొంధా తుఫాను పుణ్యమా అని వర్షాలు ముందస్తుగా కురిసాయి.

**లక్ష ఎకరాల్లో పంటలు:**

శ్రీకాళహస్తి,సత్యవేడు నియోజకవర్గాల్లో వ్యవసాయ పనులు చురుగ్గా సాగుతున్నాయి.ఈరెండు నియోజకవర్గాల్లో సుమారు లక్ష ఎకరాలకు పైగా వ్యవసాయం సాగుతుంది.ఇందులో ప్రధానంగా వరి పంటను పండిస్తున్నారు. అయితే రైతులు కోరుకునే వంగడాలు దొరకటం లేదు. ఇక్కడి వాతావరణానికి అనుకూలంగా ఉండే వంగడాల కోసం రైతులు తెలంగాణ,తమిళనాడులకు పరుగులు తీస్తున్నారు. అధికారులు అందించిన సమాచారం మేరకు ఇక్కడ 45వేల హెక్టార్లలో వరి, 30వేల హెక్టార్లలో వేరు శెనగ పంటను పండిస్తున్నారు. సాధారణంగా నవంబర్ చివరి వారంలో కురిసే వర్షాలతో చెరువులు,కుంటలు,నిండుతాయి. నవంబర్ మాసంలో 332 మి.మీల వర్షపాతం కురుస్తుంది. ఒక్కొక్కసారి 500 నుంచి 600 మి.మీల వర్షం కూడా నమోదౌతుంది. అయితే ఈ ఏడాది అక్టోబర్‌లోనే రెండు నెల వర్షం కురిసింది. దాంతో అన్నదాతల్లో ఉత్సాహం పెరిగింది,మళ్ళీ ఈ నెల 19,24లలో రెండు తుఫాను హెచ్చరికలు జారి చేసారు. దాంతో రైతులు పరుగులు తీస్తున్నారు. తూర్పు మండలాల్లో 750 చెరువులు ఉన్నట్లు చెబుతున్నారు.

**పెరిగిన భూగర్భ జలాలు:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి,ఏర్పేడు మండలాల్లో స్వర్ణముఖీ పరివాహక ప్రాంతంలో భూగర్భజలాలు పెరిగాయి.చెరువులు నిండుకుండల్లా ఉండగా కలుజులు పారుతున్నాయి. బావుల్లో నీటి నిల్వలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ంరైతుల్లో అమితోత్సాహం చోటు చేసుకుంది. కొన్ని చోట్ల నాట్లు వేస్తుండగా మరి కొందరు రైతులు నార్లు పోసుకుంటున్నారు. ఇంకొందరు దుక్కులు దున్నుకుంటున్నారు. రైతులు విత్తు,విత్తం కోసం పరుగులు తీస్తున్నారు.అయితే రైతులకు అవసరమైన వంగడాలను వ్యవసాయశాఖ నాణ్యతైన అవసరమైన వంగడాలను అందించాల్సి ఉంది.

## ధ్యానం సమస్త సమస్యల పరిష్కారం మార్గం



**కల్లూరు, నవంబర్ 11 ప్రభాతవార్త** ధ్యానం సమస్త సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతుందని భద్రాచలం పిరమిడ్ గురువు పద్మావతి అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కమ్మ పల్లెలో మంగళవారం శ్రీ సీతారామాంజనేయ పిరమిడ్ ధ్యాన మందిరాన్ని ప్రారంభించారు. పలువురు గురువులు మాట్లాడుతూ నిత్యజీవితంలో ధ్యానం ఒక భాగమైతే మానసిక ప్రశాంతత చేకూరుతుందని, సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతుందని అన్నారు. గ్రామాలలో ఐకమత్యంతో పిరమిడ్ ధ్యాన మందిరాలు నిర్మించడం ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు. ధ్యానమార్గం భక్తి మార్గం మానవ జీవితానికి ఎంతో కీలకమని ఆ దిశగా అందరూ కృషి చేస్తే విధంగా పిరమిడ్ ధ్యాన మందిరాలు ముందు ఉంటాయని అన్నారు. అనంతరం సన్మాన కార్యక్రమం నిర్వహించారు అన్నప్రసాద వితరణ గావించారు. రఘుపతి రాఘవ రాజారాం భక్తి గీతం ఆలపించారు. ధ్యాన మందిరం ప్రారంభోత్సవం ఎంతో ప్రశాంత వాతావరణంలో ఆహ్లాదకరంగా జరిగింది. ప్రకృతి కూడా ఎంతో చల్లదనాన్ని ఇవ్వడం ధ్యాన మందిర ప్రారంభోత్సవ ప్రత్యేకతగా నిలిచింది. ఈ పాకాల పిరమిడ్ మాస్టర్ గిరి, ఉభయ చిత్తూరు జిల్లా నుంచి పిరమిడ్ మాస్టర్లు, గురువులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా ప్రజల సమస్యలను పరిష్కరించాలి

– పారిశుధ్యం పై ప్రత్యేక చొరవ తీసుకోవాలి – వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచాలి



**రొంపిచెర్ల, నవంబర్ 11 ప్రభాతవార్త:** రొంపిచెర్ల మండలంలో పార్టీలకతీతంగా అన్ని శాఖల అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. రొంపిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. దీనికిగాను త్రాగునీటి ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. అధికారులు గ్రామాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేయాలని కోరారు. అర్హులైన వారికి పెన్షన్‌లు మంజూరు చేయాలని కోరారు. మండల వ్యవసాయ శాఖా అధికారిని శ్రావణి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా వేరుశనగ పంట సాగు చేసే రైతులకు జిప్సం అందుబాటులో ఉందన్నారు. 50 కేజీల బస్తా రూ.177 తో ఇవ్వడం జరుగుతుందన్నారు. జింక్ సల్ఫేట్ ప్రతి రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉందన్నారు. అలాగే పశువైద్యాధికారిని ఉషరాణి మాట్లాడుతూ 6130 పశువులకు గాలికుంటూ వ్యాధి టీకాలు వేయడం జరిగిందన్నారు. 72 శాతం సబ్సిడీతో 4300 కేజీల జొన్న విత్తనాలు, 2600 కేజీల మొక్కజొన్న విత్తనాలు అందించడం జరిగిందన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా చెరువులలో పూడికలు తీయడం వలన లీకేజీ వస్తోందన్నారు. సప్లై ఛానల్‌ను పూడ్చివేయడం, చెరువులను ఆక్రమించి పంటలు పండించడం వలన చెరువులో నీరు నిల్వలు తగ్గుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సహకార సంఘం చైర్మన్ రఘునాథ రెడ్డి, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, సీడీపీఓ వాణిశ్రీ దేవి, ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ వినయ్, ఏపీవో బాలమురళి, ఇరిగేషన్ ఏఈ ముని శేఖర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్, డిప్యూటీ ఎంపీడీఓ జి.మధుసూదన్ రెడ్డి, పీఆర్ ఏఈ నాగేశ్వర రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

## క్యాంటీన్ నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానం

**చిత్తూరురూరల్, నవంబరు 11 ప్రభాతవార్త:**

చిత్తూరు నగరంలోని పివికెయస్ డిగ్రీ కళాశాల ఆవరణలో 2025-26 విద్యాసంత్సరానికి క్యాంటీన్ నిర్వహణకు ఆసక్తి తగిన అనుభవం వున్న వ్యక్తులు, సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన ధరఖాస్తులను ఈనెల 17వ తేది సాయంత్రం 5గంటలలోపు కళాశాల కార్యాలయంలో అందజేయాలని, నిబంధనల ప్రకారం బిడ్డింగ్ నిర్వహించి అర్హులైన వారికి క్యాంటీన్ నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తామని, వివరాలకు కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ నాగేంద్రను సంప్రదించాలని ప్రిన్సిపాల్ జీవన్‌జ్యోతి కోరారు.

## అతిధి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

**చిత్తూరురూరల్, నవంబరు 11 ప్రభాతవార్త:**

చిత్తూరుపట్టణం, పివికెయస్ కళాశాలలో ఎంయస్సీ(రసాయనశాస్త్రం), బియస్సీ కంప్యూటర్‌సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్ బోధించుటకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ధరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా.పి. జీవన్‌జ్యోతి తెలిపారు. ఎంయస్సీ బోధించుటకు నెట్, సెట్, పిహెచ్‌డి వున్నవారికి, బియస్సీ కంప్యూ టర్ సైన్స్‌కు ఎంసిఏ,ఎంయస్సీ(కంప్యూటర్స్)లతో పాటు పిహెచ్‌డి, నెట్, స్లెట్ వున్నవారిని ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ఇతర వివరాలకు ఎంఎస్సీ రసాయనశాస్త్ర విభాగ సమన్వయకర్త రమేష్(9182320973), 9885885303లను సంప్రదించాలని కోరారు.

## వాహనాల వేలం: రూ.2.73 లక్షల ఆదాయం

**పుంగనూరు రూరల్ నవంబర్ 11 ప్రభాతవార్త**

పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన వాహనాలకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి సమక్షంలో మొత్తం 18 బైకులను వేలానికి ఉంచగా, అందులో 15 బైకులు అమ్ముడయ్యాయి. ఈ వేలం ద్వారా రూ.2,73,500 ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు. సీజ్ చేసిన వాహనాలను సరైన విధానంలో విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుందని అన్నారు.

## పార్టీని బలోపేతం చేస్తూ ప్రజల్లోకి వెళ్తాం

– చిత్తూరు నియోజకవర్గ తెలుగుదేశం కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే గురజాల



***చిత్తూరు, నవంబర్ 11 ప్రభాతవార్త:*** తెలుగుదేశం పార్టీలో కొత్తగా పదవులు పొందిన నాయకులందరు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తూ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల పార్టీ కార్యవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్బంగా ఎమ్మెల్యే గురజాల నియమితులైన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి మాట్లాడుతూ తెలుగుదేశం క్రమశిక్షణ వున్న పార్టీ అని, ఎన్టీఆర్ బడుగు, బలహీన వర్గాలు, మహిళల కోసం పార్టీని స్థాపించారని, నేడు సిఎం నారా చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌లు తెలుగుదేశం పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం అధ్యక్షులు సిఆర్ రాజన్, శాప్ చైర్మన్ రవినాయుడు, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, పరిశీలకులు సునీల్‌కుమార్, మేయర్ అముద, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఝాన్సీ వెంకటేష్, గుడిపాల మండల పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, టౌన్ కమిటీ అధ్యక్షులు నరేష్, వెంకిటీల సురేంద్రకుమార్, చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## వార్త ప్రభావం



ప్రభుత్వ భూమి సర్వే.. హెచ్చరిక బోర్డు ఏర్పాటు

**వి.కోట, నవంబర్ 11 ప్రభాతవార్త**

మండలంలోని జవునిపల్లి గ్రామ సమీపంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిపై అధికారులు దృష్టి సారించారు. ఈనెల 9న 'వార్త'లో 'ప్రభుత్వ భూమి యథేచ్ఛగా కబ్జా' అనే కథనం వెలువడిన విషయం విదితమే. దీనిపై తహశీల్దార్ ఉదయ్ సంతోష్ స్పందించారు. ప్రభుత్వ భూమిని సర్వే చేయించి ఆ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేయించారు. ప్రభుత్వ భూమిలో ఎవరూ ప్రవేశించరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో విఆర్వో రాజప్ప, సర్వేయర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్ సరదా కాదు.. అమానుషం



**తిరుపతి విద్య, నవంబర్ 11 ప్రభాతవార్త:** ఎస్వియూలో యాంటీర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం స్టూడెంట్స్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది.విద్యాసంస్థల్లో ర్యాగింగ్ ను పూర్తిగా నిరోధించడంలో భాగంగా ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్.యస్వీయూ వైస్ చాన్సలర్ ఆచార్య నర్సింగరావు,రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల్లో మానవతా విలువలను పెంపొందించడమే అసలు విద్యని ఎస్పీ వారు అన్నారు.ర్యాగింగ్ పేరుతో తోటి విద్యార్థి మనోభావాలను దెబ్బతీయడం మానవత్వం కాదన్నారు.కొత్తగా యూనివర్సిటీలో అడుగు పెట్టిన విద్యార్థులను భయపెట్టకుండా,స్నేహపూర్వకంగా ప్రోత్సహించడం ప్రతి సీనియర్ బాధ్యతని, ర్యాగింగ్ ద్వారా ఎవరికీ ఆనందం రాదు,కానీ అది ఎదుటివారికి మానసిక క్షోభను కలిగిస్తుందని, అలాంటి ఘటనలు జరిగితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.ర్యాగింగ్ ఘటనపై ఫిర్యాదు చేసిన వారికి పూర్తి రక్షణ, న్యాయం అందించబడుతుందని ఎస్పీ హామీ ఇచ్చారు.ఈ సందర్భంలో యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య నరసింగరావు మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది విద్యార్థి జీవితాన్ని దెబ్బతీసే దుర్మార్గమైన అలవాటని,మన యూనివర్సిటీలో ప్రతీ విద్యార్థి సురక్షిత వాతావరణంలో చదువుకునే హక్కు వుందని,ఆ హక్కుకు ఎవరైనా భంగం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. రెక్టార్ ఆచార్య అప్పారావు,రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు,ఉత్తమ ప్రవర్తన విశ్వవిద్యాలయం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డియస్పీ భక్తవత్సలం,ఆచార్య ఓవి యస్ రెడ్డి,ఆచార్య చంద్రాయుడు,కో ఆర్డినేటర్లుడాపత్తిపాటివివేక్,డాకల్యాణ్‌కుమార్,అధికారులు,విద్యార్థినీ,విద్యార్థులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆకనంబట్టు తడి చెత్త పొడి చెత్త కార్యక్రమం

**పూతలపట్టు, నవంబర్ 11, ప్రభాతవార్త**



ఆకనంబట్టు గ్రామ పంచాయతీలో మంగళవారం ఉదయం డిపిఓ, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు పంచాయతీలో పర్యటించి పొడి చెత్త తడి చెత్త గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిసరాల శుభ్రత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు సర్పంచ్ ఎంఎస్ మణి పంచాయతీ సెక్రెటరీ నిర్మల, డి ఏ ఆయేషా, ఈఏ రమ్య, విహెచ్ఎ మోనిక, డబ్ల్యూఈఏ భరత్ కుమార్, గ్రామస్తులు మాజీ సర్పంచ్ సంఘం అధ్యక్షులు దయాసాగర్ రెడ్డి, దేవరాజు నాయుడు,రేవంత్, ఆశా వర్కర్ రీటా గ్రీన్ నెంబర్ వాసు గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కుప్పం సమగ్రాభివృద్ధే సిఎం చంద్రబాబు ధ్యేయం

– ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, నవంబర్ 11 ప్రభాతవార్త** కుప్పం నియోజకవర్గ సమగ్రాభివృద్ధే సిఎం చంద్రబాబునాయుడు ధ్యేయమని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్లశ్రీకాంత్ పేర్కొన్నారు.మంగళవారం కెడిపల్లి పంచాయతీ మటార్లపల్లిలో నలభైలక్షల వ్యయంతో నూతన సిసి రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా డా॥ కంచర్ల మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఆదేశాలతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రోడ్లు, తాగునీరు, ఎల్ఇడి లైట్లు వేయించడంతో పాటు మరుగుదొడ్లు, అర్హులకు పక్కా ఇళ్ల మంజూరు చేయడం జరుగుతోందన్నారు. రైతులకు గ్రామాల్లో గోకులం షెడ్ల నిర్మాణాలు సైతం చేపట్టడం జరుగుతోందన్నారు. రైతులకోసం కుప్పానికి సిఎం చంద్రబాబు కృష్ణాజలాలు తెచ్చారన్నారు. యువతకు ఉపాధికోసం స్థానిక ంగానే పరిశ్రమలు స్థాపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, సర్పంచ్ సరస్వతి, నేతలు మహేంద్ర, బాలాజీ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## చిత్తూరు కోర్టుకు హాజరైన తెదేపా నేతలు

**కుప్పం, నవంబర్ 11 ప్రభాతవార్త**



కుప్పం నియోజకవర్గంకు చెందిన పలువురు తెలుగు దేశం పార్టీ నేతలు మంగళవారం చిత్తూరు జిల్లా కోర్టుకు వాయిదా నిమిత్తం హాజరయ్యారు. 2022లో రామకుప్పం మండలం కొల్లుపల్లిలో జరిగిన సంఘటనల నేపథ్యంలో అప్పట్లో పలువురు తెదేపా నేతలపై హత్యాయత్నం, ఇతర కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో కోర్టు విచారణకు నేతలు హాజరయ్యారు. కాగా మరలా ఈనెల 14వతేదికి కేసు వాయిదా పడినట్లు తెలిసింది.

## పేదల ఆరోగ్యంపై సిఎం చంద్రబాబు చొరవ

– ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, నవంబర్ 11 ప్రభాతవార్త** కుప్పం నియోజకవర్గంలోని పేదల ఆరోగ్యంపై సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ చూపుతున్నారని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. మంగళవారం కుప్పంలో సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో భవ్య సంస్థచే ప్రజలకు ఉచితంగా నిర్వహిస్తున్న రక్త పరీక్ష శిబిరాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 49రకాల రక్త పరీక్షలు జరిపిన అనంతరం ప్రజలకు ఏయే వా్యధులు ఉన్నాయో గుర్తించి అవసరమైన చికిత్సలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సోమశేఖర్, ఎంఆర్‌సురేష్, కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, రెస్కో డైరెక్టర్ శివ, పిఎస్ సతీష్, లోకేష్ పాల్గొన్నారు.

## గ్రామీణవిద్యకు మౌలానా ఆజాద్ విశేష కృషి

– బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ – కెఇసిలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం !!



**కుప్పం, నవంబర్ 11 ప్రభాతవార్త** గ్రామీణ, బాలికా విద్యకు భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశేష కృషి చేశారని బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో జాతీయ విద్యా దినోత్సవం సందర్బంగా ఆజాద్ చిత్రపటానికి ఆయన పూజలు చేసిఘన నివాళులు అర్పి ంచారు. స్వాతంత్ర్య సమరయోధుల్లో ఆజాద్ కూడా ఒకరని దేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేశారన్నారు. వయోజన అక్షరాస్యత, సార్వత్రికప్రాథమిక విద్యకు కృషి చేశారన్నారు. దేశంలో అనేక వర్సిటీలు ఆయన నేతృత్వంలో నిర్మితమయ్యాయన్నారు. ఆయన స్ఫూర్తితో ముందుకుసాగాలని సూచిం చారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్క రన్, ఆర్‌అండ్‌డిడైరెక్టర్ కోదండరామయ్య, మాధవన్, గంగాధర్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## చిత్తూరు ఎంపిని కలసిన ద్రవిడ వర్సిటీ వి.సి.



**కుప్పం, నవంబర్ 11 ప్రభాతవార్త** చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాద్ రావును మంగళవారం ద్రవిడ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎం.దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పలమనేరులో ఎంపిని కలసిన వారు వర్సిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలనికోరారు.దీనిపైఎంపి దగ్గుమళ్ల సానుకూలంగా స్పందించి తనవంతు సహకారం అందిస్తామని చెప్పారు.

## రెండు పంచాయతీలు కానున్న ననియాల తాండా

**రామకుప్పం, నవంబర్ 11 ప్రభాతవార్త**



మండలంలోని ననియాల తాండా పంచాయతీని రెండుగా విభజించే ప్ర క్రియను పదిహేనురోజుల్లో పూర్తి చేసేలా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారుల్ని ఆదేశించినట్లు రామాపురం తాండా వాసులు తెలిపారు. 2019లో ప్రభుత్వం ననియాల తాండా, రామాపురం తాండాలను కలిపి ఒకే పంచాయతీగా ఏర్పాటుచేసిందన్నారు. రెండు గ్రామాల మధ్య దూరం ఉండడంతో రామాపురం తాండా గ్రామస్తులు హైకోర్టును ఆ శ్రయించారు. దీంతో 2021లో పంచాయతీ ఎన్నికలుజరగలేదు. ఈ ఏడాది ఆగస్టులో హైకోర్టు రెండు పంచాయతీల ఏర్పాటుకు తీర్పునిచ్చి తగు చర్యలనిమిత్తం ఉన్నతాధికారులను ఆదేశించింది. అయితే ఆదేశాల అమలు జాప్యం అవుతుండడంతో రామాపురం తాండా వాసులు చిత్తూరులో జిల్లా కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందించారు. దీనిపై తదుపరి చర్యలకు కలెక్టర్ డిపిఒను ఆదేశించారు.

## శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంకు ట్రస్ట్ బోర్డు నియామకం



**కుప్పం, నవంబర్ 11 ప్రభాతవార్త** జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంకు ట్రస్టీల బోర్డును నియమిస్తూ దేవదాయ శాఖ ఇన్‌చార్జ్ కమీషనర్ రామచం ద్ర మోహన్ కోడూరి ఉత్తరు ్వలు జారీ చేశారు. ఈ ట్రస్ట్ బోర్డు రెండేళ్లపాటు కొనసాగనుంది. ఛైర్మన్‌గా బిఎంకె రవిచంద్రబాబు, సభ్యులుగా సంతోషమ్మ, వినాయకన్, మహేష్, శారదమ్మ, రాజ్‌కుమార్, నరేష్, వెన్నెల, మంజులాదేవి, లక్ష్మి, జ్యోతీష్‌తోపాటుఎక్స్ అఫిషియోసభ్యులుగాఅర్చకులు సోమశేఖర్ నియమి తులయ్యారు.

## వాటర్‌షెడ్ పనుల్లో రాష్ట్రంలో చిత్తూరు జిల్లా నెంబర్‌వన్

– కేంద్ర మంత్రి చేతుల మీదుగా జన్ భాగ్ ధారి కప్ అందుకున్న డ్వామా పిడి రవికుమార్

చిత్తూరు, నవంబర్ 11 ప్రభాతవార్త:



రాష్ట్రంలో వాటర్ షెడ్ పనులు చేపట్టడంలో చిత్తూరు జిల్లా నెంబర్ వన్‌గా నిలిచింది. రాష్ట్ర స్థాయిలో వాటర్ షెడ్ పనుల అమలులో నెంబర్‌వన్‌గా నిలి చిన చిత్తూరు జిల్లాకు జన్ భాగ్ ధారి కప్ అవార్డు లభించింది. ఈ మేరకు గుంటూరు లయోలా పబ్లిక్ పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా చిత్తూరు జిల్లా డ్వామా పిడి రవికుమార్, పథక అధికారి శోభారాణిలు జన్ భాగ్ ధారి కప్ అవార్డును అందుకున్నారు. సదుం మండలం చెరుకువారిపల్లి వాటర్ షెడ్ ప్రాజెక్టు అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.3.28 కోట్లతో 211 పనులు చేపట్టి పూర్తి చేశారు. ఈ పనులు చేపట్టి పూర్తి చేయడంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 617 మంది రైతులకు లబ్ది చేకూరింది. అలాగే నేషనల్ లెవెల్ కాన్ఫరెన్స్ జన్ భాగ్ ధారి కప్ కాంపిటీషన్‌లో భాగంగా పిఎంకెఎస్‌వై 2.0 చెరుకువారిపల్లి ప్రాజెక్టుకు అదనంగా రూ20 లక్షల చెక్కును అందజేశారు. ఈ నిధులను సహజవనరుల యాజమాన్యం కింద ఉపయోగించుకోవాల్సి వుంటుంది.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## క్రీడలతో విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెంపు

– రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ ఛైర్మన్ అమినేని రవినాయుడు



**చిత్తూరు, నవంబర్ 11 ప్రభాతవార్త:** క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆలోచనాశక్తి పెంపొందుతుందని, జిల్లా లో క్రీడాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ ఛైర్మన్ అమినేని రవి నాయుడు అన్నారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మంగళవారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థను సందర్శించగా ఆయనకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహ న్‌నాయుడు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలతలు ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి నిధులు విడుదల చేస్తోందన్నారు. కళాశాలలు, పాఠశాలలు, యూనివర్సిటీలు సమన్వయంతో క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా డిఎస్‌డిఏ బాలాజీ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధికి రూ.2.50 కోట్ల ప్రతిపాదనలు అందించగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానని శాప్ ఛైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, సీనియర్ నాయకుడు చంద్రప్రకాష్, ఇతర తెలుగుదేశం నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## దేశానికి కలాం సేవలు స్ఫూర్తిదాయకం

జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్



**చిత్తూరు, నవంబర్ 11 ప్రభాతవార్త:** దేశానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం హాలులో మంగళవారం జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి, మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మోహన్‌కుమార్ మాట్లాడుతూ భారత జాతీయోద్యమంలో మౌలానా ప్రముఖ పాత్ర వహించారని, ఆజాద్ 1888 నవంబర్ 11న మక్కాలో జన్మించారని, ఆయనకు చిన్నప్పుడే అరబిక్, పర్షియన్, టర్కీస్, ఉర్దూ భాషల్లో పాండిత్యం వుండేదన్నారు. మౌలానా ప్రారంభంలో ముస్లీం లీగ్ భావాలతో బయలుదేరినా పరాయి పాలనకు స్వస్తి పలకాలంటే సాయుధ పోరాటమే శరణ్యమని భావించి పలు విప్లవ సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి చిన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బిజెపి నాయకులు చిట్టిబాబు, జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎస్.రెహమాన్, బిసీ కమిటీ సభ్యులు జాకీర్, మయాన్, అర్షద్ అయూబ్ ఖాన్, తెలుగుదేశం మైనార్టీ నాయకులు కాలేషా, ఎండి అన్వర్‌భాషా, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, జిల్లాలోని మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యా విప్లవానికి ఆజ్యం పోసిన ఆజాద్ చిరస్మరణీయుడు

వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి



**చిత్తూరుహెల్త్, నవంబర్ 11 ప్రభాతవార్త:** భారతదేశంలో విద్యా విప్లవానికి ఆజ్యం పోసిన భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిరస్మరణీయుడని చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జీ ఎంసి విజయానందరెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు వైకాపా కార్యాలయంలో మంగళవారం ఎసి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం దేశానికి మొదటి విద్యాశాఖ మంత్రిగా విద్యావ్యవస్థను పటిష్టం చేయడానికి ఆబుల్ కలాం ఆజాద్ పలు నిర్మాణాత్మక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో ఆజాద్ బాటలోనే మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యార్థుల అభ్యున్నతికి పాటు పడ్డారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా మాజీ సిఎం వైఎస్ జగన్ తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లీం నాయకులు, విద్యార్థులు, మత పెద్దలు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## విద్య ఐక్యతకు మార్గదర్శకం ఆజాద్

**చౌడేపల్లి, నవంబర్ 11 ప్రభాతవార్త**



స్వాతంత్ర్య, విద్యా, ఐక్యతకు మార్గదర్శకం మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. జాతీయ విద్యాదినోత్సవం సందర్బంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతావని తొలి విద్యాశాఖా మంత్రిగా ఆయన చేసిన సేవలను వివరించారు. స్వాతంత్రోద్యమంలో ఆజాద్ పాత్రను తెలియజేసారు. ప్రిన్సిపాల్ జయప్రకాష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బాలాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 16న మదనపల్లికి తరలిరండి : ఎంఎంనాడు

**చౌడేపల్లి, నవంబర్ 11 ప్రభాతవార్త**



ఈనెల 16న మదనపల్లిలో జరిగే మాలమహానాడు మహాసభలకు తరలిరావాలని ఆసంఘ మండలాధ్య క్షుడు కొత్తపల్లి మణి పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానికంగా వారు మహాసభల గోడపత్రికలు, కరపత్రా లను ఆవిష్కరించారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చలుంటాయనీ, మాల లందరూ సభకు హాజరై విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గ బాధ్యుడు కృపామణి, మండల నాయకులు నక్కా సురేష్, రెడ్డిప్రసాద్, కూరపర్తి ఈశ్వర్, వాటర్‌వాష్ మణి, గుట్టా రెడ్డిశేఖర్, సొరకాయల సురేష్, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భాస్కర్‌ను పరామర్శించిన యమలా

**పుంగనూరు, నవంబర్ 11 ప్రభాతవార్త**



అగ్రవర్ణాల వారి దాడిలో గాయపడిన మాల మహానాడు నాయకుడు భాస్కర్‌ను యమలా సుదర్శనం పరామర్శించారు. మంగళవారం జాతీయ మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ యమల సుదర్శనం ప్రభుత్వాసుపత్రికి వచ్చి భాస్కర్‌ను పరామర్శించారు. భాస్కర్‌పై అగ్రవర్ణాలవారు దాడి చేసిన వైనంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి పైఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్య దర్శి అశోక్, జిల్లా నాయకులు గుండా మనోహర్, మల్లెల మోహన్, యమల చంద్రయ్య పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలకు కూల్చివేత

**పుంగనూరు నవంబర్ 11 ప్రభాతవార్త**



మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా జరుగుతున్న అదనపు అంతస్తు నిర్మాణాలను మున్సిపల్ అధికారులు అడ్డుకొని కూల్చివేశారు. వివరాలు ఇలా ఉన్నా యి. 14వ వార్డు పరిధిలోని కొత్త ఇండ్లు మదనపల్లె రోడ్డులో ఒక వ్యక్తి అనుమతి లేకుండా అదనపు అం తస్తు నిర్మాణానికి సిద్ధపడ్డాడు. ఈ విషయాన్ని హెచ్చ రించిన వినక పోవడంతో అధికారులు మంగళవారం ఉదయం ప్రాంతానికి చేరుకుని అదనపు అంతస్తు నిర్మాణాన్ని తొలగించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు సాగిస్తున్న ఈ భవనానికి తక్కిన అనుమతులు కూడా నిలిపివేయనున్నట్లు కమిషనర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

## జనసేన ఆధ్వర్యంలో తాత్కాలిక రోడ్డు నిర్మాణం

**సోమల నవంబర్ 11 ప్రభాతవార్త**

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తుగడంవారిపల్లి నుంచి నంజంపేట వెళ్లే రహదారిలో దళవాయి చెరువు వద్ద కట్ట తెగిపోయింది. దీంతో చెరువులో ఉండే నీళ్లు మొత్తం వెళ్లిపోవడంతో పాటు రోడ్డు కోసకపోవడంతో నెల రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. రహదారి నిర్మాణం కోసం అధికారులకు పలుమార్లు విన్నవించిన స్పందన మాత్రం కరువైంది. దీంతో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి నాగభూషణం ఆధ్వర్యంలో మండల జనసేన పార్టీ యువత నడుం బిగించారు. జెసిబి ట్రాక్టర్లు పెట్టి కట్టకు మట్టితోలి రహదారి సౌకర్యం కల్పించేందుకు వారు ప్రయత్నాలు చేస్తున్నారు.

## బలిజపల్లెలో వైద్య శిబిరం

**కల్లూరు, నవంబర్ 11, ప్రభాతవార్త**

పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంగళంపేట ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని నన్నూరి వారి పల్లి గ్రామ పంచాయతీ బలిజ పల్లె గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి చిరువ్యాధులకు చికిత్స చేశారు. ఆరోగ్య సిబ్బంది గ్రామంలోని ఇంటింటిని సందర్శించి ఫీవర్ సర్వేఖ నిర్వహించి జ్వరపు కేసులు ఏమైనా ఉన్నాయా అని విచారించారు. ఆరోగ్య విస్తరణాధికారి చంద్రయ్య, పర్యవేక్షకులు పురుషోత్తం, సామాజిక ఆరోగ్య అధికారిణి ప్రత్యూష, ఆరోగ్య కార్యకర్త సుబ్బలక్ష్మి, ఆశా కార్యకర్తలు ప్రమీల, భూదేవి, నిర్మల పాల్గొన్నారు.

## శివయ్యకు యూనియన్ బ్యాంకు విరాళం



**శ్రీకాళహస్తి, నవంబర్ 11 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని యూనియన్ బ్యాంకు శ్రీకాళహస్తీశ్వరునికి రూ.2.9 లక్షలు విరాళం అందించారు. బ్యాంకు 107 సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంగా బ్రాంచి మేనేజర్ శేఖర్‌రెడ్డి ఖాతాదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ, శ్రీకాళహస్తీశ్వరునికి బ్యాంకు తరఫున విరాళం అందించారు. శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు శ్రీకాళహస్తిలో రూ.460కోట్లు వ్యాపారం జరిగిందన్నారు.మంగళవారం బ్యాంకు ఆవరణలో ఖాతాదారులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. బ్యాంకు అభివృద్ధికి శ్రీకాళహస్తీశ్వరుని హుండీల రాబడితో పాటు దేవస్థానం ఉద్యోగుల సహకారం ఎంతో ఉందని శేఖర్‌రెడ్డి వివరించారు. అలాగే బ్యాంకు కూడా శివభక్తులకు ఇతోధిక సేవలను అందిస్తున్నామని వివరించారు.

## ఉర్దూపాఠశాలలో జాతీయ విద్యాదినోత్సవం



**శ్రీకాళహస్తి, నవంబర్ 11 ప్రభాతవార్త** ఇక్కడ మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జాతీయ విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మూవ్‌మెంట్స్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సారథ్యంలో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పన్నులు,నోట్‌పుస్తకాలు, పన్సిళ్ళు విద్యా మెటీరియల్స్‌ను అందించారు.ఈ సందర్భంగా నిరాడంబరత గురించి వివరించారు. మనల్ని సృష్టించి పాలిస్తున్న అల్లాహ్ ఆదేశాలను ప్రవక్త ఆచరించిన విధానాలను విస్మరించరాదని వక్తలు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రిజ్వాన, యంపిజే,జేఐహెచ్ జిల్లా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు షేక్ అమీర్‌బాషా,, అబ్దుల్ కలామ్, లాల్‌బాషా, ముహమ్మద్,నూరే అస్లాం, కరీముల్లాఖాన్, ముబారక్,హుమాయూన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## వరదబాధితులకు అండగా సత్యసాయి సేవా సమితి

**శ్రీకాళహస్తి, నవంబర్ 11 ప్రభాతవార్త** సామాజిక,సేవా రంగాల్లో తనదైన శైలిలో సేవలందిస్తున్న శ్రీకాళహస్తిలోని సత్యసాయి సేవా సమితి మంగళవారం మరో అడుగు ముందుకేసింది. కెబిపురం మండలంలో సంభవించిన జలప్రళయ విపత్తులో బాధితులుగా మారిన వారికి సహాయం అందించేందుకుముందుకు వచ్చారు. సుమారు 700 మంది బాధితులకు దుప్పట్లు బిస్కెట్లు అందించారు. సమాజంలో పొరుగువారికి సాయపడవోయ్ అన్న పుట్టపర్తి సాయి నాథుని పిలుపు మేరకు సమితి సుమారు రూ.1లక్ష విలువ కల్గిన సహాయాన్ని అందిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమాల్లో ట్రస్టు కన్వీనర్ పాండురంగారావు,సభ్యులు చెంగయ్య, రవిబాబు, దామోదరం, సునీల్, యశ్వంత్,మునిరెడ్డి, లలీతమ్మ ఉషాదేవి, సుబ్బమ్మ, చెంచులక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## దేశం మద్దతు దారుడు మృతి



**తొట్టంబేడు, నవంబర్ 11 ప్రభాతవార్త** తొట్టంబేడు మండలం కొత్త కండ్రిగ గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకుడు తిరుమన్యం ముత్తారెడ్డి హఠాన్మరణం చెందారు. మంగళవారం ఆయన మృతదేహానికి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పార్టీ నాయకులు హాజరై నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. వారి కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. ఆయనతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు, చెంచయ్య నాయుడు ,మాజీజడ్పిటిసి వెంకటాచలంలు ఉన్నారు.

## క్యాలండర్ల ఆవిష్కరణ

**శ్రీకాళహస్తి, నవంబర్ 11 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయ నూతన సంవత్సరం 2026కు సంబంధించిన క్యాలండర్లను సోమవారం ధర్మకర్తల మండలి సమావేశంలో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి చే ఆవిష్కరింపజేసారు. గతంలో క్యాలండర్లు నూతన సంవత్సరం ప్రారంభం అయిన తరువాత ఆవిష్కరించేవారు. అయితే కూటమి ప్రభుత్వంలో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సమయ పాలనకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అంతేకాక గత ఏడాది ఇఓ డి.బాపిరెడ్డి రెండు నెలల ముందుగానే క్యాలండర్లను రూపొందించి ఆవిష్కరిస్తున్నారు. చక్కటి ఆయిల్ పేపర్లతో రూపొందించారు. ఆకర్షణీయంగా రూపొందించిన క్యాలండర్ ధర రూ.150గా నిర్ణయించినట్లు ఇఓ తెలిపారు.ఈ ఆవిష్కరణలో బోర్డు చైర్మెన్ కొట్టె సాయి సభ్యులుసభ్యులు పగడాలమురళి, గోపినాధ్,గుర్రప్పశెట్టి, లక్ష్మీనారాయణ, కె.నాగరాజు. రాఘవయ్య,కోలా విశాలి,హేమావతి, రజని,స్రవంతి, కుమారి, సావిత్రి,కౌసల్య,విజయమ్మ, డి.లక్ష్మమ్మ,ప్రత్యేకాహ్వానితులు వెంకటరామ్,చాగంటి శైలజలు హాజరయ్యారు.

## కార్తీక మాసం భరద్వాజ తీర్థంలో హోమాలు: అన్నదానాలు



***శ్రీకాళహస్తి, నవంబర్ 11 ప్రభాతవార్త*** శ్రీకాళహస్తిలోని కైలాసగిరి పర్వత పంక్తుల్లో వెలసిన భరద్వాజ మహాముని ఆరాధనోత్సవాలను మంగళవారం అంగరంగా వైభవంగా పులిపాటి చిత్తర్‌రాజ్ కుమార్‌స్వామి నిర్వహించారు. భరద్వాజ మహాముని ఇక్కడ భరద్వాజ తీర్థంను ఏర్పాటు చేసుకొని పూజలు నిర్వహిస్తూ తపస్సు చేసుకున్నారు. ఈనేపథ్యంలో ఆయన విగ్రహం ఇక్కడ స్థాపించబడింది. ఆయనచే నిర్మించిన ఆలయంలో నేటికి ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ మంగళవారం గురుపూజోత్సవం ను నిర్వహించారు. ఇక్కడ భారీ ఎత్తున హోమాలు నిర్వహించారు.స్వామి వారికి షోడశాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాధువులకు వస్త్ర దానం నిర్వహించారు. అంతేకాక ఇక్కడకు వచ్చిన భక్తులకు అన్నదానం,సాధువులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు మాతాజీ రోహిణి, శివయోగి దావా శ్రీనాథ్,రామలింగస్వామి, అనందస్వామి,ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా ఆర్యవైశ్య సమాజం రాష్ట్ర కార్యదర్శి ఐతా మురళి,రాంబాబుశెట్టిలు పాల్గొన్నారు.పూజలను అనందస్వామి సారధ్యంలో నిర్వహించారు.

## ఆలపాకంలో 20 సంవత్సరాల రెవెన్యూ సమస్య పరిష్కారం

**విజయపురం, నవంబరు 11 ప్రభాతవార్త:** మండలంలోని ఆలపాకంలో 20 సంవత్సరాలు పెండింగ్‌లో ఉన్న ఇంటి జాగసమస్య మంగళవారం పరిష్కారమైందని తహసీల్దార్ కిరణ్ తెలిపారు. 20 సంవత్సరాల క్రితం పిచ్చయ్య, కన్నయ్య ఇరువురి మధ్య పట్టా భూమిలో ఇంటి జాగ విషయమై వివాదం నెలకొంది. ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకుంటూ జిల్లా సర్వేయర్ కూడా రెండు పర్యాయాలు సర్వే నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. పిచ్చయ్య ఇంటి జాగలో కన్నయ్య కుటుంబీకులు ఇంటి నిర్మాణం చేపట్టడంతో సమస్య ఉత్పన్నమైనది. సమగ్ర విచారణ నిర్వహించిన తహసీల్దార్ ఇరువర్గాలను గ్రామంలో పిలిపించి గ్రామ పెద్దల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి కన్నయ్య ఆక్రమించుకున్న ఇంటి జాగకు బదులు, సమీపంలో రెండు సెంట్లు కేటాయించడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్‌శేఖర్, వీఆర్‌వోలు చిదంబరం, విజయ్, సర్వేయర్ హరీష్, నాయకులు శివలింగం పాల్గొన్నారు.

## రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలు పంపిణీ - ఎమ్మెల్యే



**కేవీబీ పురం, నవంబరు 11 ప్రభాతవార్త:** మండలంలోని రాయపేడు గ్రామంలో సర్పంచ్ పన్నూరు బాలాజీ అధ్యక్షతన కేవీబీ పురం అనుసంధానం ప్రకృతి వ్యవసాయ సంబంధిత అధికారులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సహకార సొసైటీ వారిచే ఉచితంగా ఏర్పాటు చేసిన వేరుశనగ కాయల విత్తనాలు రైతులకు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వృథా చేయకుండా వాటిని మరలా పండించి పక్క రైతులకు మనమే ఇచ్చిన వేరుశనగ కాయల వారికే సప్లయ్ చేసి రేట్లు తీసుకుని రైతులు అభివృద్ధి చెందాలని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఆనాటి ఆహార పదార్థాలపైన వంటలు ఎలా పండించేది, ఆ నాటి పదార్థాలను గురించి ఆయన వివరించారు. ప్రతి ఒక్కరు పంటలు పండించాలని ఆయన పలు సూచనలు అందించారు. సీపీఎం జనార్ధన్, నాగరాజు, పాలమంగళం రమేష్, మాజీ ఎంపీపీ మనీ, సొసైటీ సంఘ సభ్యులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై విచ్చలవిడిగా స్పీడ్ బ్రేకర్స్

### మహిళలు, వృద్ధులు పడిపోతున్నా పట్టించుకోరా..?

### బైపాస్ బాట పట్టిన ఆర్‌టిసి బస్సులు

***చంద్రగిరి, నవంబర్ 11 ప్రభాతవార్త:*** పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై విచ్చలవిడిగా స్పీడ్ బ్రేకర్స్ వేయడంపై వాహన చోదకుల నుండి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. తిరుపతి రూరల్ మండలం, కాలూరు-చెర్లోపల్లి మధ్యన ఇష్టారాజ్యంగా స్పీడ్ బ్రేకర్స్ నిర్మించడం పట్ల వాహనచోదకులు ముఖ్యంగా ద్విచక్ర, ఆటోలు, కార్లు వాహనదారులు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస నిబంధనలు పాటించకుండా ఎవరి మెప్పు కోసం, ఎవరి ప్రయోజనాల కోసం ఈ స్పీడ్ బ్రేకర్స్ నిర్మించారంటూ నిలదీస్తున్నారు. స్పీడ్ బ్రేకర్ వున్నట్లు ఎటువంటి సూచిక బోర్డులు లేకపోవడం, రేడియం లైట్స్ పెట్టకపోవడం, స్పీడ్ బ్రేకర్‌పై నాశిరకం జీబ్రాలైన్లు వేడంతో అవికాస్త కనుమరుగవడంతో మహిళలు, వృద్ధులు తమ ద్విచక్ర వాహనాన్ని అదుపుచేయలేక ప్రమాదాలకు గురై ఆసుపత్రులపాలవుతున్నారు. గతంలో తుమ్మల గుంట ఫ్లైఓవర్ నిర్మిస్తుండటంతో బైపాస్ బాట పట్టిన ఆర్టీసి బస్సులు నేటికీ పూర్తి స్థాయిలో ఈ మార్గంలో రావడంలేదనేది బహిరంగ సత్యమే. అయినప్పటికీ వస్తున్న కొద్దిపాటి ఆర్టీసి బస్సులు సైతం ఈ స్పీడ్ బ్రేకర్స్ కారణంగా సమయం సరిపోవడంలేదనే కారణంతో (వేగ నియంత్రణ పట్ల అసహనం) బైపాస్ బాటపడుతున్న సందర్భాలు లేకపోలేదు. నేషనల్ హైవేలపై స్పీడ్ బ్రేకర్లు నిర్మించడానికి గల నిబంధనలు ఏమిటీ, నిర్మించే క్రమంలో పాటించవలసిన సూత్రాలేమిటీ, ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం తలెత్తకుండా పర్యవేక్షించాల్సిన అధికారులలో తూట్లుపొడిచిందెవరనే అంశాల పట్ల రోడ్ సేఫ్టీ అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలనీ, లేనిపక్షంలో ఇష్టారాజ్యంగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్స్‌ను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## బాంబు పేలుళ్ల దృష్ట్యా రేణిగుంటలో హై అలర్ట్...





**రేణిగుంట నవంబర్ 11 ప్రభాతవార్త** ఢిల్లీ ఎర్రకోట వద్ద కారు బాంబు పేలుళ్ల నేపథ్యంలో పోలీస్ అధికారులు రేణిగుంట పట్టణం, మండలంలోని అన్ని ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు అర్బన్ సీఐ జయచంద్ర, అర్బన్ ఎస్సై నాగరాజు, ట్రైనీ ఎస్సై స్వాతి,రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు, జి ఆర్ పి సి ఐ ఏతేంద్ర తమ సిబ్బందితో రైల్వే స్టేషన్ లోపల, బయట, స్టేషన్ పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో డాస్క్వాడ్ ద్వారా పలు అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర తరతమా బేధాలు లేకుండా టాక్సీ స్టాండ్ లోని స్థానికంగా తిరిగే టాక్సీలను కూడా వదలకుండా డాగ్ స్క్వాడ్, సిబ్బంది తో దగ్గరుండి తనిఖీలు చేపట్టారు. ఇది ఇలా ఉండగా రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంలో రూరల్ సీఐ మంజునాథరెడ్డి, గాజులమండ్యం ఎస్సై సుధాకర్, ట్రైనీ ఎస్సై ప్రవల్లిక, సిఐఎస్ఎఫ్ అధికారులు సిబ్బందితో విమానాశ్రయ ప్రాంగణంలోని ప్రతి అంగుళం చివరకు ప్రీపెయిడ్ టాక్సీలను కూడా తనిఖీలు చేశారు. పోలీస్ అధికారులు అనుమానాస్పద వ్యక్తులను విచారించారు. ఆగంతకులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఆగంతుకుల కదలికలను కనిపెట్టడం కోసం కొంతమంది పోలీసులను అధికారులు మఫ్టీలో నియమించారు.

## శ్రీలక్ష్మి కనకదుర్గమ్మ దేవాలయంలో కార్తీక వనమహోత్సవం



**పుత్తూరు రూరల్, నవంబరు 11 ప్రభాతవార్త:** పుత్తూరు మున్సిపల్ పరిధిలోని రాచపాళెం సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మి కనకదుర్గమ్మ దేవాలయంలో కార్తీక వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు వందవాసి మహేశ్‌శర్మ కోశాధికారి పురాణం నవీన్‌కుమార్ శర్మ వేద పండితులు శ్రీధరం సుమన్, కుమార్ శర్మ ఆధ్వర్యంలో కార్తీక మాస వన మహోత్సవం కార్యక్రమం నిర్వహిం చారు. గణపతి పూజ మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం జరిగింది. లలితా సహస్రనామావళి, వేద పండితులచే చతుర్వేద స్వస్తి లక్ష్మి కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు అభిషేకాలు, అలంకరణలు చేశ్వారు. ఆలయంలో శ్రీ శివానంద స్వామి పర్యవేక్షణలో లంక నవీన్ పర్యవేక్షణ తిప్పావఝ్జుల శ్రీకాంత్‌శర్మ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్రాహ్మణ సభ్య సంఘ సభ్యులు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.హరిపురాల శ్రీనివాసులుశర్మ, కె.వి.సురేష్, శ్రీనివాస్, కల్యాణ్, తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘం సంయుక్త కార్యదర్శి బాలాజీరావు, అధికార ప్రతినిధి కె.బాలాజీశర్మ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం ఆధ్వర్యంలో చీరలు, చిన్న పిల్లల డ్రస్సులు పంపిణీ

**పుత్తూరు రూరల్, నవంబరు 11 ప్రభాతవార్త:** సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో వరద ముంపు బాధితులను ఆదుకోవడంలో ఎప్పుడు సీపీఎం ముందుంటుందని సీపీఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు తెలిపారు. మంగళవారం కళత్తూరులో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యులు దాసరి జనార్దన్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్ ప్రాంతీయ కార్యదర్శులు నాగరాజు ఆధ్వర్యంలో బాధితులకు చీరలు, దుస్తులు, చిన్న పిల్లల డ్రస్సులు పంపిణీ చేశారు.

## తిరుమల లడ్డూ నాణ్యత చూడలేని ధర్మారెడ్డి



**తిరుపతి, నవంబర్ 11ప్రభాతవార్త:** టిటిడి ఈఓగా పనిచేసిన మాజీ ఏవి ధర్మారెడ్డి తిరుమల లడ్డూనాణ్యత ప్రసాదం పరిశీలించలేక అవమానించారని జనసేననేత కిరణ్‌రాయల్ ఎద్దేవాచేశారు. ఆయన ఈఓగా ఉన్న హయాంలో లడ్డూల నాణ్యత లేకపోయిందని, ఇప్పుడు దేవుని లడ్డూను చూడాలని, రుచి చూడమని ఇస్తే పరారయ్యాడని కిరణ్ ఆరోపించారు. ఖచ్చితంగా నెయ్యిలో కల్తీ జరిగిందని, గత కల్తీనెయ్యి పాపంతోనే లడ్డూలు రుచిగా లేవనేది భక్తులు చెప్పిన విషయాలన్నారు. కూటమి ప్రభుత్వంలో లడ్డూనాణ్యతను చూడమని లడ్డూలు ఇస్తే తినకుండా వెళ్ళిపోయారని కిరణ్‌రాయల్ మీడియాకు తెలిపారు.

## కమిటీల డైరెక్టర్‌లకు బిజెపి సన్మానం

**తిరుపతి, నవంబర్ 11ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వంలో పలు అభివృద్ధికమిటీల డైరెక్టర్లుగా నియమితులైన బిజెపి నేతలకు ఆ పార్టీ ఆత్మీయంగా సన్మానించింది. కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టిడి వరప్రసాద్, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొండేటి ప్రేమ్‌కుమార్‌లను మంగళవారం బిజెపి నాయకులు సన్మానించారు.పార్టీ వెస్ట్‌మండల నాయకులు పొనగంటి బాస్కర్, కీర్తివెంకయ్య, నాదముని, సుబ్బుయాదవ్, జనార్ధన్‌రెడ్డి, రమేష్‌యాదవ్, హరి, సింగాలగుంట నాగరాజు, చెన్నమనేని నవీన్ రాయల్,వెంకటమునితదితరులు పాల్గొని ఇద్దరు నేతలకు డైరెక్టర్ పదవులు రావడం హర్షణీ యమన్నారు.

## క్రీడల్లో ఎస్వీజేసి విద్యార్థుల ప్రతిభ



### జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

**తిరుపతి విద్య నవంబర్ 11 ప్రభాత వార్త:** శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈ నెల ఎనిమిది నుండి పది తేదీల్లో,అనంతపురం జిల్లా కందుకూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో విశేష ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పంతొమ్మిది సంవత్సరాల లోపు జూడో కురాష్ విభాగంలో సీనియర్ సీఈసీకి చెందిన పి. నవీన్,బైపిసి కి చెందిన ఎస్.మోలాలి, జూనియర్ సీఈసీకి చెందిన బి.ఫయాజ్, హెచ్ఈసి కి చెందిన ఎమ్.వివేకానంద మొదటి స్థానాలల్లో నిలిచి పసిడి పతకాలు పొంది ఉత్తర ప్రదేశ్ లో జరుగు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.అలాగే సీనియర్ బై పిసికి చెందిన ఎన్.సోహెల్ భాష ఆరు కిలో మీటర్ల మారథాన్ పరుగు పందెం లో రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానం సాధించి ఒడిశా లో జరుగు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.సీనియర్ ఎమ్ ఈ సి కి చెందిన సి.వసంత్ కుమార్ రాష్ట్ర స్థాయి జూడో లో కాంస్య పతకాన్ని,సీనియర్ ఎమ్ ఈ సి కి చెందిన ఎం. సుబ్రమణ్యం కాంస్య పతకాన్ని సాధించగా పదిహేను సంవత్సరాల లోపు హాండ్ బాల్ పోటీలో జూనియర్ ఎంపిసికి చెందిన కె. సుబ్రమణ్యం రజత పతకాన్ని సాధించాడు.మరి కొంత మంది విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.పలు విభాగాల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులను,ప్రిన్సిపాల్ సి.ప్రకాష్ బాబు అభినందించారు.

## ఎస్‌జిఎస్‌ఆర్ట్స్ కళాశాలలో మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు



**తిరుపతి విద్య నవంబర్ 11 ప్రభాత వార్త:** ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాలలో గోవిందరాజ వాకర్స్ అసోసి యేషన్ వారి సహకారంతో డిగ్రీ ప్రథమ,ద్వితీయ సంవత్సరాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మెరిట్ ప్రాతిపదికన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశామని కళాశాల ప్రిన్సిపల్ డా.బి. సత్యనారాయణ తెలిపారు.తి.తి.దే. కళాశాలైన ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శ్రీ గోవింద రాజ వాకర్స్ అసోసియేషన్ ఉంది. వాల్లు ఎస్ జి ఎస్. కళాశాలలోని విద్యార్థులకు తమ వంతుగా ప్రోత్సాహన్ని ఇవ్వడానికి గత మూడు సంవత్సరాలుగా మెరిట్ ప్రాతిపదికన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేస్తున్నారు.అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా డిగ్రీ ప్రథమ,ద్వితీయ సంవత్సరాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు 16 మందికి ఒక్కొక్కరికి 3000/ రూపాయిల చొప్పున నగదు బహుమతులను కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.సత్యనారాయణ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రఘురా మిరెడ్డి, సెక్రటరీ చక్రపాణి,వైస్ ప్రిన్సిపాల్ డి.పరమేశ్వర,అధ్యాపక,అధ్యాప కేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తుల సదుపాయాల పరిరక్షణకు చర్యలు:



**శ్రీకాళహస్తి, నవంబర్ 11 ప్రభాతవార్త** శ్రీకాళ హస్తీశ్వరాలయం ఆలయంలోనికి భక్తులు వచ్చేందుకు వానా కాలం,ఎండా కాలంలో పడుతున్న అవస్థలను గుర్తించి సన్నిధివీదిలో చక్కటి షెడ్డులను ఏర్పాటు చేసారు.అయితే ఇది పార్కింగ్ దారులకు వరంగా మారింది. ఇక్కడి దేవస్థానం టెండర్ల ద్వారా కోట్లు దండుకుంటున్నారు. కాంట్రాక్టర్లు పోటీలు పడి టెండర్లను దక్కించుకుంటున్నారు.కానీ వచ్చిన వాహ నాలకు పార్కింగ్ సదుపాయం లేదనేభావం విస్మరించారు. దాంతో టెండర్ దారుడు ముక్కుపిండి పార్కింగ్ పీజును వసూలు చేసుకుంటున్నారు. కానీ వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలన్నది చూపటం లేదు.దాంతో వాహన దారులు తమ వాహనాలను నీడలో నిలబెట్టుటకు సాహసిస్తున్నారు. భక్తులకు రక్షణగా ఏర్పాటు చేసిన షెడ్డుల కింద వాహనాలు పార్కింగ్ చేయటం గమనించిన అధికారులు పరిష్కాంగా దిమ్మెలను నిర్మిస్తున్నారు.దాంతో వాహనాలు షెడ్డుల కిందకు రాకుండా కట్టడి చేస్తున్నారు.అలాగే రాజగోపురం ఉత్తరం దక్షిణం కాంట్రాక్టర్లు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలను పార్కింగ్ చేస్తున్నా పట్టించుకోవటం లేదు.పార్కింగ్ ఫీజులను వసూలు చేసుకునే వారు వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో చూపకపోవటం చర్చనీయాంశంగా మారింది.

# తిరుపతి డివిజన్

## స్కూలు బస్సుల నిర్వహణలో నిబంధనలు పాటించాలి

ఎంవిఐ చంద్రశేఖర్



***పుత్తూరు, నవంబరు 11 ప్రభాతవార్త :*** స్కూలు బస్సుల నిర్వహణలో ఆయా పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని మోటారు వాహనాల తనిఖీ అధికారి పి.చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన డిఎస్పీ రవికుమార్, సిఐ శేఖర్‌రెడ్డిలతో కలిసి స్కూలు బస్సులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను, పసి పిల్లలను తీసుకెళ్లే స్కూలు బస్సులు నిర్వహించడంలోనూ, నడపడంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో స్కూలు బస్సుల కండిషన్ తనిఖీ చేసి వాటిలోని మెకానికల్ సమస్యలను గుర్తించి యాజమాన్యాలకు తెలియజేసి వాటిని మెరుగుపరచాలనే ఉద్దేశ్యంతో బస్సుల తనిఖీ చేపట్టినట్టు తెలిపారు. బస్సుల్లోని లోపాలను సరిదిద్దిన తర్వాత మళ్లీ వాటిని పరిశీలిస్తామని తెలిపారు. ఇకపై ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ మోటారు వాహన రూల్స్ 185 (జి)లో పొందుపరిచిన అన్ని నిబంధనలను స్కూలు యాజమాన్యాలు పాటించాలని తెలిపారు. విద్యార్థుల భద్రత అందరి బాధ్యతన్నారు. స్కూలు యాజమాన్యాలతో పాటు డ్రైవర్లు, బస్సు అటెండర్లు, పేరెంట్స్ కమిటీలు స్కూలు పిల్లల భద్రతకు పాటుపడాలని కోరారు. మొత్తం 40 బస్సులు చెక్ చేసి లోపాలు తెలియజేశారు.

## ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుక



**పుత్తూరు, నవంబరు 11 ప్రభాత వార్త :** విద్య ద్వారా దేశాభివృద్ధి జరుగుతుందని నమ్మిన మహానుభావుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. దేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా ఆయన చేసిన సేవలకు గుర్తుగా నవంబరు 11న జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కాలేజీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం తర్వాత దేశంలో విద్య ప్రాముఖ్యతను తెలియజేసిన నాయకుడని కొనియాడారు. ఆయన హయాంలోనే యుజిసి, ఐఐటిలు వంటి సంస్థలు రూపుదిద్దుకున్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కోటేశ్వరయ్య, అధ్యాపకులు డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ సుజన, డాక్టర్ పి.హరిబాబు, డాక్టర్ ఆర్.బి.వాణిశ్రీ, ఎ.నాగేశ్వరరావు, డాక్టర్ ఎ.దేవకి తదితర విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## జలవిలయానికి అతలాకుతలమైన ఐదు గ్రామాలు : శంకర్‌రెడ్డి

కేవీబీ పురం, నవంబరు 11 ప్రభాతవార్త: రాయల చెరువుకు గండిపడి గ్రామాలు ఏ స్థాయిలో అతలాకుతలం అయ్యాయో అందరికి తెలిసిన విషయమే. సీఎం వెంటనే తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఇటు పార్టీకి, అటు ప్రభుత్వ అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతున్నట్లు సత్యవేడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి తెలిపారు. గ్రామస్తుల సదుపాయాల ఏర్పాట్లపై నిత్యం పర్యవేక్షిస్తూ తనవంతు సహాయ సహకారాలు అందిస్తు, తన సొంత నిధులతో 2 మందికి భోజన సదుపాయం కల్పించారు. అదే విధంగా పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, తిరిగి గ్రామాల్లో పారిశుధ్య పనులు పూర్తయిన వెంటనే వారి వారి ఇళ్ళకు పంపివేయడం జరుగుతుందన్నారు. నష్టపోయిన పశు రైతులకు, వరి రైతులకు, నివాస గృహాలు దెబ్బతిన్న లేక కూలిపోయిన వాటికి ప్రభుత్వం వాటికి కచ్చితంగా ఆదుకుంటుందన్నారు.

## చిన్న హృదయాల్లో పెద్ద మనసు...

న

### బాధితులకు విద్యార్థుల సహాయ హస్తం

**కేవీబీ పురం, నవంబరు 11 ప్రభాతవార్త:** రాయలచెరువు కట్ట గండిపడి కళత్తూరు, పాతపాళెం, అరుంధతివాడ ప్రాంతాలు వరద ముప్పుకు గురైన విషయం తెలిసిందే.ఈ క్రమంలో బాధితులకు అండగా నివాలన్న ఉద్దేశంతో కేవీబీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినూత్నంగా ముందుకొచ్చారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కునాటి సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులు కాలనీలు, వీధులు, దుకాణాలను సందర్శిస్తూ ఇంటింటికి తిరిగి స్వచ్ఛందంగా విరాళాలు సేకరించారు. విరాళాలను రాయల చెరువు ముంపుతో నష్టపోయిన కళత్తూరు పాతపాళెం, అరుంధతివాడ బాధితులకు అవసరమైన నిత్యావసరాలు, దుస్తులు, మందులు కొనుగోలు చేసి అందించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు సురేష్ తెలిపారు.

## చంద్రశేఖర్‌రాజుకు ప్రముఖుల నివాళులు



**వడమాలపేట, నవంబరు 11 ప్రభాతవార్త:** పుత్తూరు శాంతి థియేటర్ యజమాని, వైసీపీ నాయకులు చంద్రశేఖర్‌రాజు ఆకస్మిక మృతికి పలువురు నివాళులర్పించారు. చంద్రశేఖర్‌రాజు గుండెపోటుతో మృతి చెందగా ఆయన భౌతికకాయానికి నివాళులర్పించిన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. వైసీపీ నాయకులు, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి శ్రీ బొమ్మరాజుపురం వెళ్లి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ డీఈవో శేఖర్,విజయబాబు, జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సురేష్‌రాజు, సర్పంచ్ మణిరాజు, డాక్టర్లు రవిరాజు, శ్రీనివాసులురెడ్డి, శ్రీధర్‌రాజు, నాయకులు చక్రపాణి రెడ్డి, అమ్ములు(ఏకుమలై), ధనంజయలునాయుడు, భాస్కర్‌రెడ్డి, మదనమోహన్ రెడ్డి, మాధవరాజు తదితరులు ఉన్నారు.

## జంగాలపల్లిలో పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు

**నారాయణవనం, నవంబర్ 11 ప్రభాతవార్త :** మండలంలోని ఎరికంబట్టు పంచాయతీ జంగాలపల్లి గ్రామంలో ఇటీవల పగిలిన పైప్‌లైన్‌ని పంచాయతీ కార్యదర్శి హరిబాబు మంగళవారం మరమ్మతు చేశారు. కొద్దిరోజుల క్రితం పైప్‌లైనన పగలడంతో నీటి సమస్య ఏర్పడినది. దీన్ని గుర్తించిన పంచాయతీ సిబ్బంది మరమ్మతు చేశారు. త్వరలో ఎరికంబట్టు గ్రామంలో కూడా పైప్‌లైన్ మరమ్మతును బుధవారం చేస్తామన్నారు. ఇకపోతే వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా ముందస్తుగా మొలాధిన్ స్ప్రే చేస్తామన్నారు.

## నేడు సత్యవేడులో వైకాపా భారీ ర్యాలీని విజయవంతం చేద్దాం

**నారాయణవనం, నవంబర్ 11 ప్రభాతవార్త :** రాష్ట్ర వైఎస్సాఆర్‌కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటు పరంను నిరసిస్తూ సత్యవేడులో బుధవారం ఉదయం 10గంటలకు భారీ ర్యాలీని విజయవంతం చేద్దామని మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు తెలిపారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడాన్ని నిరసిస్తూ ఈ ర్యాలీ జరుగుతుందన్నారు. కావున వైకాపా నాయకులు, కార్యకర్తలు అందరు పాల్గొనాలని కోరారు.

## పండగ వాతావరణంలో పట్టాల పంపిణీ

**రేణిగుంట నవంబర్ 11 ప్రభాతవార్త** రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ సిబిఐడి కాలనీ వద్ద రైల్వే నిర్వాసితులకు పండగ వాతావరణం లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మంగళవారం ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. తిరుపతి రేణిగుంట మూడవ లైన్లో భాగంగా గువ్వల కాలనీవాసులు తమ ఇళ్ళను కోల్పోయారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విశేష కృషి ఫలితంగా రైల్వే శాఖ నిర్వాసితులకు నష్టపరిహారం అందజేశారు. నిర్వాసితుల్లో పలువురు రైల్వే స్టేషన్ ఆధారంగా పూసలు దండలు అమ్ముకొని జీవించే షికారిలు ఉన్నారు. వారికి రైల్వే స్టేషన్‌కు దగ్గరగా ఇళ్ల స్థలాల ఇవ్వడానికి రైల్వే అధికారుల ద్వారా సిబిఐడి కాలనీ వద్ద కేంద్ర ప్రభుత్వానికి చెందిన స్థలాన్ని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రమేయంతో కొనుగోలు చేశారు. ఒక్కొక్క నిర్వాసిత కుటుంబానికి ఆ స్థలంలో ఎమ్మెల్యే ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పాటుపడే ప్రభుత్వం అన్నారు. తెలుగుదేశ కూటమి పాలనలో ఎవరికి ఎలాంటి అన్యాయం జరగదన్నారు. కోల్పోయిన ఇంటి స్థలం కంటే ఎక్కువ స్థలం ఇవ్వడమే కాకుండా రైల్వే శాఖ ద్వారా వారికి నష్టపరిహారం అందజేశామన్నారు. అనంతరం ఆయన రేణిగుంటకు చెందిన విలేఖరి మణి తండ్రి రామచంద్రయ్య గత కొద్ది రోజుల క్రితం మృతి చెంది ఉండడంతో మణి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో రవిచంద్ర, మండల సర్వేయర్ కరుణాకర్,రూరల్ సిఐ మంజునాథరెడ్డి, గాజులమండ్యం ఎస్సై సుధాకర్, తూకివాకం కార్యదర్శి రమేష్, తిరుపతి పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి,రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, టిడిపి జిల్లా రైతు సంఘం నాయకులు మునస్వామి నాయుడు,రేణిగుంట టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ పుష్పనాదం, తూకివాకం మాజీ సర్పంచ్ భాస్కర్ యాదవ్, టిడిపి సీనియర్ నేతలు నెల్లూరు సుబ్రమణ్యం రెడ్డి, కొరియర్ రవి, నవాబు, వన సంరక్షణ సమితి ఉప చైర్మన్ హనీఫ్, రేణిగుంట పట్టణ యూత్ నాయకుడు కిరణ్ మహిళా నాయకులు హమీద, కుమారమ్మ , పుమణి, తదితరులు పాల్గొన్నారు.ఆర్జిటి 1. పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే.

## ఆలయ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

పుత్తూరు రూరల్, నవంబరు 11 ప్రభాతవార్త:



ఆలయ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వరాలయం చైర్మన్ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులు సంప్రదాయ దుస్తులతో రావాలని పేర్కొన్నారు. ఇటీవల కాశీబుగ్గలో జరిగిన దుర్ఘటనను దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఈవో జయకృష్ణ, సభ్యులు పార్థిబన్, అమృతవల్లి, విజయకుమార్, చిలకమ్మ, మునికుమార్ పాల్గొన్నారు.

## డిసెంబర్ 7న అయ్యప్ప జ్యోతుల గ్రామోత్సవం



సూళ్లూరుపేట, నవంబర్ 11 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో గత 27 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న అయ్యప్ప జ్యోతుల గ్రామోత్సవాన్ని విజయవంతం చేయాలని అయ్యప్ప భక్త బృందం వారు మంగళవారం కోరారు. స్థానిక షార్ బస్టాండు వద్ద ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో డిసెంబర్ 7న ప్రారంభమవుతుందని తెలిపారు. ఉదయం 6 గంటలకు శ్రీ అయ్యప్ప స్వామికి 16 ద్రవ్యాలతో పాటు నెయ్యాభిషేకాన్ని నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. సాయంత్రం గ్రామోత్సవం సందర్భంగా కేరళ వారి చందమేళం, మంగళ వాయిద్యాలు, బాణాసంచా వేడుకలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. మహిళలు దీపాలు చేతబూని స్వామివారి జ్యోతుల గ్రామోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. మహిళలు ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొనాలని అయ్యప్ప భక్తబృందం వారు విజ్ఞప్తి చేశారు.

# గూడూరు డివిజన్

## నారాయణ వైద్యశాలచే ఉచిత వైద్యశిబిరం

సూళ్లూరుపేట, నవంబర్ 11 ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధిలోని సూళ్లూరు గ్రామంలో నెల్లూరుకు చెందిన ప్రముఖ వైద్యశాల నారాయణ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. కీళ్లు, ఎముకల వ్యాధులు, చర్మవ్యాధులు, కంటి సమస్యలు, చిన్న పిల్లల ఆరోగ్య సమస్యలపై పరీక్షలు చేశారు. వీరికి సూళ్లూరుపేట నుంచి ఉచితంగా బస్సు ఏర్పాటు చేసి నెల్లూరులోని నారాయణ ఆసుపత్రికి తీసుకెళ్లి అక్కడ ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ ఉచిత వైద్యశిబిరాన్ని ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పిట్ల సుబ్రహ్మణ్యం, కౌన్సిలర్ చెంగమ్మ, వెంకటస్వామి, చెంగయ్య, ప్రశాంత్, సాయి, ఆలీభాయ్, సిహెచ్ సురేష్, నరేంద్ర, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం : ఎమ్మెల్యే



గూడూరు రూరల్, నవంబర్ 11 ప్రభాతవార్త: మండల పరిధిలోని కొమ్మ నేటూరు పంచాయతీలో ఏపిఐఐసి ఆధ్వర్యంలో 48 ఎకరాల్లో ఎమ్ఎస్ఎమ్ఈ పార్కుకు మంగళవారం ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్ఎస్ఎమ్ఈ పార్కు నిర్మాణం కోసం తొలి విడతగా 20 ఎకరాల్లో 9కోట్ల 65లక్షల రూపాయలతో పనులు జరుగుతాయని అన్నారు. మొత్తం ప్రాజెక్టు విలువ 129 కోట్ల రూపాయలుగా ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం చంద్రబాబు 110 ఎమ్ఎస్ఎమ్ఈ పార్కులకు శంకుస్థాపన చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న ఉద్దేశంతో సూక్ష్మ చిన్న మధ్యతరగతి పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్నారు. గూడూరు నెల్లూరు జిల్లాలో కలపాలన్నందుకు అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రభుత్వ భూమిపై కన్నేసిన కబ్జాదారులు



దొరవారిసత్రం, నవంబర్ 11 ప్రభాతవార్త: మండలం భూ కబ్జాదారులకు అడ్డాగా మారిందని భూమి కనిపిస్తే జెండా పాతేస్తున్నారు. దొరవారిసత్రం మండల పరిధిలోని మొన్న నెలబల్లి సర్వే నెంబర్ 7లో కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురైన విషయం తెలిసింది. పత్రికల ద్వారా రెవిన్యూ అధికారులు అడిగితే ఆ రోజు వరకు హెచ్చరిక బోర్డులు పెట్టడం మరుసటి రోజు అదే బోర్డులను పీకేసి కబ్జాదారులు యథావిధిగా కోట్లు విలువ చేసే భూమిని చదును చేయడం జరిగింది. కబ్జా చేసిన వ్యక్తులపై ఎటువంటి చర్యలు తీసుకోపోవడం ఆ విషయాన్ని చనుగా తీసుకొని మండలంలోని శ్రీధరమల్లి ఉల్లేరుచెరువు సర్వే నెంబర్1లో 18 ఎకరాల భూమి కబ్జాదారుడు, దర్జాగా కబ్జా చేస్తుంటే పట్టించుకోవాల్సిన రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్టు వ్యవహరించడం ఏంటని ఆ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన రెవిన్యూ అధికారులే వారికి అండదండగా వ్యవహరించడం ఏంటని, అంతే కాకుండా కబ్జాదారులకు రెవెన్యూ అధికారులు పుష్కలంగా సహాయ సహకారాలు అందిస్తున్నారని ఆ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. కబ్జాదారుల విషయంలో ఎక్కడ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దాని అలుసుగా తీసుకొని ప్రభుత్వ భూములు చెరువులను కబ్జాదారులు అడ్డాగా చేసుకొని ఆక్రమిస్తుంటే పట్టించుకోకుండా మామూలు మత్తులో ఉండడం ఏంటని కొందరు ప్రశ్నిస్తున్నారు. కల్లూరు వద్ద విలువైన ఫారెస్ట్ భూములు చెరువులు ఆక్రమణలకు గురవుతున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం లేదని కొందరు ఆరోపణలు చేస్తున్నారు.

## స్కూల్ ముందు నీటిగుంటతో విద్యార్థులకు తిప్పలు



పెళ్లకూరు, నవంబర్11 ప్రభాతవార్త : మండల కేంద్రమైన పెళ్లకూరు లోని స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాల మరియు అంగన్వాడి స్కూల్ వద్ద ఉన్న ఈ భవనాలలోకి పిల్లలు వెళ్ళాలన్నా పైన కనిపిస్తున్న ఈ నీటిగుంటను దాటుకొని పోవడం తప్ప వేరే ప్రత్యామ్నాయమార్గం లేదు, చిన్నపాటి చినుకులకు సహితం ఈ గుంట నీటిమయమై దర్శనమిస్తుంది, గత కొంతకాలంగా ఎన్నో రోజులుగా ఈ నీటి గుంటలను చూసేవారు తప్ప పట్టించుకునే అధికారులు కానీ, నాయకులు గానీ కరువయ్యారని గ్రామ ప్రజలు వాపోతున్నారు, ఈ మురికి నీటిలో చిన్న పిల్లలు నడిచి పోవడం వల్ల ఏవైనా ప్రమాదాలు జరుగుతాయేమోనని స్కూల్ పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, పేద పిల్లలు చదువుకునే బడి కాబట్టి ఎవరూ పట్టించుకోవడంలేదని అదే రాజకీయ నాయకులు, అధికారుల పిల్లలు గానీ ఈ పాఠశాలలో ఉంటే ఇలా చేసేవారా అని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అత్యంత వైభవంగా తిరుచానూరు అమ్మవారి బ్రహ్మోత్సవాలను

- పంచమితీర్థానికి విస్తృతంగా ఏర్పాట్లు
- బ్రహ్మోత్సవాలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాక
- తితిదే ఈఓ అనిల్ కుమార్ సింగల్



తిరుచానూరు, నవంబర్ 11 ప్రభాతవార్త: తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబర్ 17 నుండి 25వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో పటిష్ట కార్యాచరణతో విజయవంతం చేయాలని తితిదే ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుచానూరు ఆస్థాన మండపంలో మంగళవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జేఈవో వి. వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణలతో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, తిరుచానూరు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఇప్పటికే రెండుమార్లు జిల్లా ఎస్పీ, టిటిడి సివిఎస్వో, టిటిడి జేఈవో సమీక్ష నిర్వహించారు. తిరుచానూరు ఆలయం పరిసరాలలోను, పద్మసరోవరం, హోల్డింగ్ పాయింట్లు వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పంచమి తీర్థం రోజు దాదాపు 75 వేల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అందుకు తగ్గట్లు అన్నప్రసాదాలు సిద్ధం చేసుకోవాలని, పటిష్ట క్యూలైన్లు, జర్మన్ షెడ్లు, పారిశుద్ధ్య పనులు, వర్షం వచ్చినా భక్తులకు ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. దాదాపు 600 మంది పోలీసులు, 700 మంది టిటిడి సెక్యూరిటీ, 900 మంది శ్రీవారి సేవకులు, 2 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు సేవలు అందిస్తారన్నారు. అదేవిధంగా, రోజువారి 10 వేల మందికి అన్నప్రసాదాలు, పంచమి తీర్థం రోజున హోల్డింగ్ పాయింట్లలో దాదాపు 25 వేల మందికి పైగా భక్తులు వేచియుండే అవకాశం ఉందన్నారు. తిరుమల తరహాలో విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు చేపట్టాలని సూచించారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ వచ్చారని, పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్స వాలకు భారత రాష్ట్రపతి గౌరవనీయులు ద్రౌపతి ముర్ము వస్తున్నారని చెప్పారు. తిరుచానూరులో భారత రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ నవంబర్ 25న పంచమి తీర్థం ఉత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవారి ఆలయం నుండి వచ్చే సారె ఊరేగింపు సందర్భంగా తిరుపతి నగరంలో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, ఈ ఏడాది పంచమి తీర్థం రోజున పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడిం చారు. భక్తులకు అవగాహన కల్పించేందుకు ఈసారి మహిళా పోలీసులను ఎక్కువ మందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. టిటిడి సివిఎస్వో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు అవసరమైన సిసి కెమెరాలను, సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసి నాలుగు మాడ వీధులలోను, పంచమి తీర్థం రోజున ప్రవేశ, నిష్క్రమణ మార్గాల యందు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ అర్చకులు బాబు స్వామి, మణికంఠ స్వామి, సీఈ టి.వి. సత్యనారాయణ, ఎఫ్.ఎ అండ్ సీఏవో ఓ బాలాజీ, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఇతర తదితరులు పాల్గొన్నారు.

## భద్రత ప్రమాణాలు పాటించండి



సూళ్లూరుపేట, నవంబర్ 11 ప్రభాతవార్త: స్కూలు బస్సులను నడిపే డ్రైవర్లు, యాజమాన్యాలు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని భద్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ, ఆర్‌టిఓ అనిల్‌కుమార్‌లు సూచించారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్కూల్ బస్సుల తనిఖీలలో భాగంగా సూళ్లూరుపేట పరిధిలోని వివిధ ప్రైవేటు స్కూళ్ల బస్సులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఉదయం లేవగానే బస్సులను తీసుకెళ్లేటప్పుడు డ్రైవర్లు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని యాజమాన్యానికి బస్సు లోటుపాట్లను ముందుగా తెలియజేయాలని డ్రైవర్లకు సూచించారు. ప్రస్తుతం తనిఖీ చేసిన బస్సుల్లో కొన్ని ప్రభుత్వ నిబంధనలకు తగినట్లుగా సౌకర్యాలు లేవని తెలిపారు. ఈ బస్సులను సక్రమమైన రీతిలో నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఈ బస్సులను సీజ్ చేస్తామని స్కూలు యాజమాన్యాలను హెచ్చరించారు. అనంతరం ప్రైవేటు స్కూలు బస్సుల డ్రైవర్లు, ఆపరేటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

## రాష్ట్ర మంత్రి నిమ్మలను కలిసిన ఏఎంసి చైర్మన్

సూళ్లూరుపేట, నవంబర్ 11 ప్రభాతవార్త: రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్ మంగళవారం కలిశారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని పెళ్లకూరు మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చినా సందర్భంగా మంత్రిని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణంతో కలిసి ఏఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్ ఘనంగా ఆహ్వానం పలికారు.

## ఢిల్లీ పేలుళ్లతో గూడూరులో తనిఖీలు





గూడూరు, నవంబర్ 11 ప్రభాతవార్త: దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుడుతో దేశమంతా ఉలిక్కిపడింది. 13ఏళ్ల తర్వాత ఢిల్లీని పేలుళ్లు వణికించాయి. ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఒక కారులో బాంబు పేలింది. ఇది తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. ఎనిమిది మంది మరణించగా, అనేక మంది గాయపడ్డారు. అందులో భాగంగానే తిరుపతి ఎస్పి సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుపతి జిల్లాలోని పలు గూడూరు మండల పరిధిలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గూడూరు డిఎస్పి గీతా కుమారి సూచన మేరకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత తనిఖీలో భాగంగా గూడూరు రూరల్ పరిధిలోని జాతీయ రహదారి ప్రధాన రోడ్డు మార్గాలు, ముఖ్యమైన కూడళ్లలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అనంతరం గూడూరు పట్టణంలోని పార్సిల్ కార్యాలయం, పలు రద్దీ ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.

## చేనేత, మరమగ్గాల పరిశ్రమలకు ఉజ్వల భవిష్యత్

-ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్



పుత్తూరు (నగరి), నవంబరు 11 ప్రభాతవార్త : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల ఏర్పాటుకు సంబంధించి ఎంఎస్ఎంఇ పార్క్ ఏర్పాటుతో స్థానికంగా చేనేత, మరమగ్గాల పరిశ్రమలకు ఉజ్వల భవిష్యత్ వుంటుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. నగరి రూరల్ మండలం మాంగాడు వద్ద మంగళవారం ఎంఎస్ఎంఇ పార్క్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నగరి మునిసిపాలిటీలోని మరమగ్గాల పరిశ్రమలు, డైయింగ్ యూనిట్ల వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. త్వరలోనే మరమగ్గాల పరిశ్రమలన్నీ మాంగాడుకు తరలించి స్థానికంగా వ్యర్థ జలాల శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీని వల్ల దీర్ఘకాలంగా నగరి పట్టణాన్ని పట్టిపీడిస్తున్న భూగర్భ జలాల కాలుష్య సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. ఈ పార్క్ కోసం వంద ఎకరాలు సేకరించామని తెలిపారు. తొలుత 25 ఎకరాల్లో కార్యకలాపాలు ప్రారంభిస్తామని తెలిపారు. దీంతో స్థానికంగా పురుషులతో పాటు మహిళలకు కూడా ఉపాధి లభిస్తుందన్నారు. అవసరమైతే మరో వంద ఎకరాలు కూడా సేకరించి వివిధ ఉత్పత్తుల తయారీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నగరి ఆర్డిఒ అనుపమ, తహాశీల్దారు రవికుమార్, పలువురు తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కోటిసంతకాల సేకరణలో వైసిపి నేతలు



తిరుపతి, నవంబర్ 11ప్రభాతవార్త: రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వంలో నెలకొల్పిన వైద్యకళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి నేతలు చేపట్టిన కోటిసంతకాల సేకరణ మంగళవారం తిరుపతిలో 11వ డివిజన్‌లో చేపట్టారు. వైద్య కళాశాలలను ప్రైవేట్ పరంచేయడాన్ని నిరసిస్తూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, యువనేత, సమన్వయ నాయకుడు భూమన అభినయ్‌రెడ్డి పిలుపుతో నేడు తలపెట్టిన భారీ ర్యాలీకి జనసమీకరణ, సంతకాల సేకరణ 11వ డివిజన్‌లో మంగళవారం వైసిపి నేతలు జనంతో కలిశారు. నాయకులు వార్డు అధ్యక్షుడు దొడ్డారెడ్డి మురళిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మురళీరెడ్డి, నగర ఉపాధ్యక్షుడు ధనశేఖర్, డివిజన్ ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నియోజకవర్గ సోషల్‌మీడియా మాజీ కో కన్వీనర్ రఘురాం, పార్టీ నాయకులు దొడ్డారెడ్డి మునికృష్ణారెడ్డి, వెంకటమునీ, విజయ్ తదితరులు పాల్గొని ఇంటింటికి సంతకాలు చేపట్టారు.

## భీమవరంలో శ్రీకాళహస్తీశ్వరుని కళ్యాణోత్సవం



శ్రీకాళహస్తి, నవంబర్ 11 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రచారంలో భాగంగా ఓ బృందాన్ని ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి నియమించారు. ఈ నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని ఉద్దరాజు అనంద్ భవన్‌లో ఉద్దరాజు ఆనంద్‌రాజ్ స్వచ్ఛంద సేవా సంస్థ సారథ్యంలో శ్రీకాళహస్తీశ్వ రాలయంలో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని కళ్యాణాన్ని కన్నుల పండువగా ఏర్పాటు చేసారు. సంప్రదాయాన్ని భావి తరాలకుఅందించే రీతిలో కళ్యాణోత్సవం సందర్భంగా కళ్యాణ వేదికను ఏర్పాటు చేసారు. నిత్యకళ్యాణం పచ్చతోరణం అన్నట్లు తీర్చి దిద్దారు. ఈ కళ్యాణోత్సవంలో డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి సారథ్యంలో ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, వేదపండితులు పౌరోహితుల అర్ధగిరి, రాకీ స్వామి తదితరులు హాజరయ్యారు. ఏర్పాట్లను ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, సుదర్శనంరెడ్డి, శేఖర్ తదితరులు పర్యవేక్షించారు.

## జూడోలో అన్నపూర్ణకు బంగారు పతకాలు



వడమాలపేట, నవంబరు 11 ప్రభాతవార్త: రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వడమాలపేట విద్యార్థిని అన్నపూర్ణ బంగారు పతకం సాధించింది. కాకినాడలో జరిగిన పోటీల్లో అండర్-17 విభాగంలో అన్నపూర్ణ బంగారు పతకాన్ని, గీతిక 40 కిలోల విభాగంలో రజత పతకాన్ని సాధించారు. బంగారు పతకాన్ని సాధించిన అన్నపూర్ణ డిసెంబరు మొదటి వారంలో మణిపూర్‌లో జరుగు జాతీయ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైనట్లు పీడీ చంద్రశేఖర్ రాజు తెలిపారు. అలాగే ఎన్‌టీఆర్ జిల్లాలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన రెజ్లింగ్ పోటీలలో వడమాలపేట విద్యార్థులు వినయ కుమార్ 52 కిలోల విభాగంలో రజత పతకాన్ని సిద్ధార్థ 45 కిలోల విభాగంలో రజక పతకాన్ని షణ్ముగం 60 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు. పతకాలు సాధించిన జాతీయ జట్టుకు ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు కరుణ నవనీతం, ఉపాధ్యాయులు అభినందించారు.

## తిరుపతిలో ప్రధాన చెరువులు అభివృద్ధి చేయండి

-మంత్రి నిమ్మలకు డాక్టర్ కోడూరు వినతి



తిరుపతి, నవంబర్ 11ప్రభాతవార్త: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలోని ప్రధాన చెరువులు అభివృద్ధి చేయాలని, ఆక్రమణలనుండి రక్షించాలని కోరుతూ రాష్ట్రమంత్రి నిమ్మలరామానాయుడుకు టిడిపి అధికారప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం విజ్ఞప్తి చేశారు. మంగళవారం మంత్రిని కలసిన డాక్టర్ బాలసుబ్రమణ్యం తిరుపతి ల్యాండ్స్ ఆఫ్‌లేక్‌గా పేరుగాంచిందని, గత కొన్నేళ్ళుగా చెరువులు ఆక్రమణలకు ,మురుగునీటి ప్రవాహం, మట్టిపేరుకు పోయిందన్నారు. వర్షపునీరు నిల్వసామర్థ్యం తగ్గి నగరంలో వరద ప్రమాదాలు పెరుగుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. అవిలాల చెరువు, పేరూరుచెరువు, రామాపురం చెరువు, కపిలతీర్థం, తిమ్మినాయుడుపల్లిచెరువు ఇలా చెరువులను శుద్ధిచేసి ఈకో పార్కులుగా అభివృద్ధి చేయడం వంటి ప్రాజెక్టులను ప్రతిపాదించారు. తిరుపతి చెరువుల జిఐఎస్ మ్యాప్ రూపొందించి, రెవెన్యూ ఇరిగేషన్ మున్సిపల్‌శాఖలు సంయుక్తంగా పర్యవేక్షణ చేసేలా చూడాలని మంత్రిని కోరారు. చెరువుల పునరుద్ధరణతో తిరుపతికి పూర్వవైభవం వస్తుందన్నారు.

## ఆదుకోవటానికి ప్రభుత్వం ఉంది : ఎమ్మెల్యే బొజ్జల



శ్రీకాళహస్తి, నవంబర్ 11 ప్రభాతవార్త: సమాజానికి నిరుపేదలకు ఏ ఆపద జరిగినా, సంభవించినా ఆదుకోవటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రభుత్వాన్ని మెప్పించి సహాయం అందించుటకు మేమున్నామని శాసన సభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. గత నెల వరుసగా కురిసిన వర్షాలతో పని లేక మగ్గం గుంటల్లో నీళ్ళు నిలిచి విధులకు ఆటంకం కల్గించిందని ఆ కార్మికులను ఆదుకొనుటకు ప్రభుత్వం నుంచి సహాయం సాధించామని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రమే కాకుండా చేతి వృత్తులకు నిలయమన్నారు. నేడు చేనేత కార్మికులుఎన్నో ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని వారి బాధలను ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు దృష్టికి తీసుకొచ్చి ఆదుకుంటామని సుధీర్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశానికి మరోముఖ్యఅతిథిగా వచ్చిన బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి ఇతోధిక సహాయ సహకారాలు అందిస్తుందని అందుకే ప్రజా పథకాలు సమర్థవంతంగా నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు, రంగినేని చెంచయ్యనాయుడు కాసరం రమేష్, పేట బాలాజి, నెమళ్లూరు బుజ్జి, ఢిల్లి బాబు తదితరులు పాల్గొన్నారు. 181 మంది బాధితులకు నష్టపరిహారాలు, నిత్యావసర సరకులను అందించారు.

## శ్రీసిటీని సందర్శించిన జర్మనీ వాణిజ్య ప్రతినిధుల బృందం



సత్యవేడు, నవంబరు 11 ప్రభాతవార్త: జర్మనీలోని సాక్సోనీ రాష్ట్రానికి చెందిన 18 మంది వాణిజ్య ప్రతినిధుల బృందం శ్రీసిటీని సందర్శించింది. ఆ రాష్ట్ర వాణిజ్య, కార్మిక, ఇంధన, వాతావరణశాఖ మంత్రి డిర్క్ పాంటర్ నేతృత్వంలో పర్యటనకు విచ్చేసిన ప్రతినిధులకు శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, విభిన్న రంగాల పరిశ్రమల ఏకోసిస్టం, అంతర్జాతీయ పెట్టుబడి దారులకు ఒనగూరే వ్యూహాత్మక వ్యాపార ప్రయోజనాలను సన్నారెడ్డి వివరించారు. 31 దేశాలకు చెందిన 240కిపైగా ప్రముఖ కంపెనీలకు నిలయమైన శ్రీసిటీలో జర్మనీకి చెందిన బెల్ ఫ్లేవర్స్, ఫ్రాగెనెన్స్, క్నాఫ్, కాంక్యో బర్ట్ పరిశ్రమలు సైతం ఉన్నాయని వారి దృష్టికి తెచ్చారు. ప్రపంచ పెట్టుబడులకు ప్రముఖ గమ్యస్థానంగా శ్రీసిటీ స్థానాన్ని బలపరచడంతో పాటు భారత్, జర్మనీ దేశాల మధ్యవ్యాపార సంబందాలకు పెంపొందిస్తాయి. సాక్సోనీ రాష్ట్రవాణిజ్య అభివృద్ధి సంస్థ విర్ట్స్ ఛాఫ్ట్ ఆధ్వర్యంలో సాగిన ఈ పర్యటనలో ప్రధానంగా దుస్తులు, మెటల్ ఉత్పత్తులు, వైద్య పరికరాల తయారీ, నైపుణ్యాభివృద్ధి, వృత్తి శిక్షణ కార్యక్రమాల్లో భాగస్వామ్య అవకాశాలను పరిశీలించారు.

## కానిస్టేబుల్ షంషీర్ జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ

- ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ క్రీడా పోటీల్లో కాంస్య పతకం



చిత్తూరు, నవంబర్ 11 ప్రభాతవార్త: కానిస్టేబుల్ ఎం.షంషీర్ జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరచాడు. 10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్-2025లో కానిస్టేబుల్ ఎం. షంషీర్‌కు కాంస్య పతకం లభించింది. ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన కానిస్టేబుల్ షంషీర్‌ను ఎస్పీ తుషార్‌డూడి అభినందించారు. జమ్ము-కాశ్మీర్ రాష్ట్రం శ్రీనగర్‌లో అక్టోబర్ 8 నుండి 16వ తేదీ వరకు 10వ ఆల్‌ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పెంచక్ సిలాట్ విభాగంలో 60 కేజీల కేటగిరిలో కానిస్టేబుల్ ఎం.షంషీర్ పాల్గొని 3వ స్థానం సాధించి కాంస్య పతకం దక్కించుకున్నాడు. ఎస్పీ తుషార్ దూడి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కాంస్య పతకం సాధించిన కానిస్టేబుల్ షంషీర్‌ను అభినందించారు.

## సంజీవనితో ప్రతి పౌరుడికి క్వాలిటీ ఆరోగ్యం : కలెక్టర్



చిత్తూరు, నవంబర్ 11 ప్రభాతవార్త: సంజీవని ప్రాజెక్ట్‌తో ప్రతి పౌరుడికి ఆరోగ్యంను సులభంగా, క్వాలిటీగా ఇవ్వడమే ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళ వారం సంజీవని డిజిటల్ నర్వ్ సిస్టంపై 28 మండలాల మెడికల్ ఆఫీసర్లకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తుల ఆరోగ్యంను డిజిటల్ రికార్డులుగా మార్చడంతో పాటు వైద్య సేవలు అందించేలా త్వరలో జిల్లా అంతటా సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ వైద్య రంగంలో ఓ గేమ్ ఛేంజర్ అన్నారు. కుప్పం డిజిటల్ నెర్వ్ సెంటర్ నుండి ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రతి పిహెచ్‌సిలో పేషెంట్ కేర్ కో-ఆర్డినేటర్ అనేవారు ఎంఎల్‌హెచ్‌పిగా విధులు నిర్వహిస్తున్న వారికి శిక్షణ ఇచ్చి నియమిస్తార న్నారు. ప్రతి పేషెంట్‌కు రిజిస్ట్రేషన్ మొబైల్ నెంబర్ ద్వారా అబా ఐడి క్రియేట్ చేయడం జరుగుతుందన్నారు. ఈ అబా ఐడితో ఓపెన్ స్లిప్ తీసుకుని స్టాఫ్ నర్స్ దగ్గరకు వెళ్ళి ఎలాంటి ప్రాబ్లం అనేది పూర్తిగా చెక్ చేసి డాక్టర్ వద్దకు పంపుతారన్నారు. డాక్టర్ ల్యాబ్ టెక్నిషియన్ వద్దకు రక్తపరీక్షల నిమిత్తం పంపి తిరిగి డాక్టర్ చెక్ చేసి మందులు రాసి పెషెంట్‌ను పార్మసీ వద్దకు పంపుతారన్నారు. వీరి ఆరోగ్యంను ఎల్లవేళలా ఫాలోఅప్ చేయడంతో పాటు వారి యొక్క రికార్డులు అబా ఐడితో ఎప్పటికీ అలాగే వుంటుందన్నారు. భవిష్యత్తులో ఏదైనా అనారోగ్యం వస్తే ఈ ఐడితో ముందు తీసుకున్న అన్ని రకాల పరీక్షలు కన్పిస్తాయన్నారు. దీంతో సులభంగా వైద్యం చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో టాటా కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవి, డాక్టర్ సరస్వతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి, తిరుపతి జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణనాయక్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడి పిరికిపంద చర్య : ప్రతాప్ స్వామీజీ



రామచంద్రాపురం, నవంబర్ 11 ప్రభాతవార్త: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఉగ్రదాడి పేలుడు ఘటన పిరికిపందల చర్యఅని ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ అన్నారు. మంగళవారం రామచంద్రాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ దాడిలో ఎంతో మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం భాధాకరమన్నారు. ఉగ్రవాదం మానవతావాదానికి భద్ధశత్రువన్నారు. దేశంలో ఉగ్రవాదులను మట్టుబెట్టి మృతి చెందిన వారికి కానుకగా ఇవ్వాలన్నారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

త్రిశూల గ్రామోత్సవం

## గంగమ్మ జాతర వేడుకలకు శ్రీకారం



చంద్రగిరి, నవంబర్ 11 ప్రభాతవార్త: చంద్రగిరి గంగమ్మ జాతర వేడుకలకు శ్రీకారంచుడుతూ మంగళవారం (మొదటివారం) శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయం వద్ద నుండి ఆలయ మాజీ చైర్మన్, గంగమిట్ట పినపెద్ద (ప్రధమ బలిపీఠం) త్రిశూల గ్రామోత్సవాన్ని పాకాల సతీష్‌కుమార్ రెడ్డి ప్రారంభిం చారు. చంద్రగిరి జాతర వేడుకలలో భాగంగా అమ్మవారి ఆలయంలో త్రిశూల పూజలు నిర్వహించారు. ఇక్కడి నుండి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బ్యాండుభాజాల నడుమ ఊరేగిస్తూ నాలుగా బలిపీఠాల వద్దకు తీసుకెళ్ళి త్రిశూలాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నలుదిక్కుల్లో గల బలిపీఠాల వద్ద మహిళలు త్రిశూలానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళహారతులు ఇచ్చారు. సాయంత్రం శ్రీమిట్టగంగమ్మ ఆలయంలో భక్తులు త్రిశూల పూజ గావించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, పినపెద్దలు విరూపాక్షి శంకర్ రెడ్డి, మొక్కల రాజారెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

-చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ, ఎమ్మెల్యే మురళీమోహన్‌లు

తవణంపల్లె, నవంబర్ 11 ప్రభాతవార్త: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తూ దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కారా ్యలయం ఆవరణలో పూతలపట్టు నియోజవర్గం పరిధిలోని ఐదు మండలాలకు చెందిన డ్వాక్రా గ్రూపు సభ్యులకు బ్యాంక్ లింకేజ్, స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా 963 సంఘాలకు 78.74 కోట్లు రూపాయలను పంపిణీ చేశారు. అలాగే మండలంలోని 1396 సంఘాలలోని 13,018 మంది సభ్యులకు 26 లక్షల రూపాయలను వెలుగు మహిళా మార్ట్ లాభాలను ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌తో కలసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు దూరదృష్టితో మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్రంలోడ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.